
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 30 జూలై 2025



విగత జీవిగా పడి ఉన్న భర్తను చూసి రోదిస్తున్న భార్య

ఇది ఏ బుక్ రాజ్యాంగం..?



సర్పంచ్ సుగుణమ్మ (ఫైల్)



టీడీపీ కూటమి ప్రభుత్వంలో ప్రతిపక్ష హోదా కూడా లేని వైసీపీవారు రాజ్యమేలుతున్నారు. ఎంతగా అంటే.. నేరుగా పోలీస్ స్టేషన్‌లో కూర్చుని.. ఓ పోలీసు అధికారి చేత టీడీపీ వర్గీయుడిని చితక్కొట్టించేంత. 'నేరం చేసినట్లు ఒప్పుకో. లేదంటే మీ నాన్నను ఎత్తుకొచ్చి ఇలాగే కొడతా. ఊర్లో కాపోళ్లందరూ ఒక్కటయ్యారు. మీ నాన్నను చంపేస్తారు..' అని ఓ పోలీసు అధికారి టీడీపీ వర్గీయుడిని బెదిరించారు అంటే.. పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అవమాన భారంతో అధికార పార్టీకి చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడంటే.. అమలవుతున్నది ఏ బుక్ రాజ్యాంగం..? వైసీపీ నేతలు చెప్పగలరా..?



నవీన్ కుమారుడిని చూపుతూ న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న వడ్డెర సంఘం నేతలు మల్లెల జయరాం తదితరులు

కూటమి ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్త బలి

- చైన్ స్నాచింగ్ నేరం మోపిన వైసీపీ సర్పంచ్
- ఒప్పుకోవాలని హింస పెట్టిన ఎస్ఐ నరసింహుడు
- అవమాన భారంతో ఆత్మహత్య చేసుకున్న నవీన్



సర్పంచ్ సుగుణమ్మ ఇంటి వద్ద బైఠాయించిన నవీన్ బంధువులు

ఉసురు తీసిన పలకరింపు



ముక్కుపచ్చలారని పిల్లోడు. నిండా పాతికేళ్లు లేవు. భార్య, ఏడాదిన్నర వయసున్న కొడుకును విడిచి, పొట్ట చేతబట్టుకుని ఊరికి దూరంగా వెళ్లిపోయాడు. జ్వరం వస్తోందని సొంతూరుకు వచ్చాడు. పనిమీద వేరే ఊరికి వెళుతూ.. అరుగుమీద కనిపించిన సర్పంచ్‌ను పలకరించాడు. ఎన్నికల్లో తన తల్లిని ఓడించిన రాజకీయ ప్రత్యర్థే అయినా, పల్లెటూరి పిల్లోడు అవేమీ పట్టించుకోలేదు. కళ్లెదుటే పెద్దామె కనిపిస్తే.. 'అమ్మా ఎలా ఉన్నారు..?' అని పలకరించకుండా ఉంటారా ఎవరైనా..! అదే చేశాడు. 'అలా పలకరించేందుకు బండి ఆపడమే నేరమైంది. లేకుంటే ఏ రామాయణమూ ఉండేది కాదు..' అని కన్నీరు పెట్టుకున్నాడు. ఇంత జరిగాక తన గురించి ఎవరేమి అనుకుంటారో..? తాను నిర్దోషినని నమ్ముతారా..? లేక అనుమానంగా చూస్తారా..? ఇకపై తన భవిష్యత్తు ఏమిటి..? అని మనోవేదనకు లోనయ్యాడు. అవమాన భారంతో ఉరితాడుకు వేలాడాడు.

కదిరి, జూలై 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్పంచ్ చేసిన ఫిర్యాదు ఆధారంగా, దొంగతనం చేసినట్లు ఒప్పుకోవాలని పోలీసులు హింసించడంతో తలుపుల మండలం పులిగిండ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజనోళ్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త నవీన్(23) ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుమల తిరుపతి దేవస్థానంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న నవీన్, మూడు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. బైక్‌పై వెళుతున్న సమయంలో గ్రామ సర్పంచ్, వైసీపీ నాయకురాలు సుగుణమ్మ ఇంటి బయట కనిపించడంతో పలకరించాడు. ఆ తరువాత ఏం జరిగిందోగానీ, నవీన్‌ను అక్కడే నిలబెట్టి దొంగతనం నేరం అంటగట్టారు. తనపై దాడి చేసి, మెడలో ఉన్న చైన్‌ను లాక్కున్నాడని సుగుణమ్మ ఆరోపించారు. ఊరందరినీ అక్కడ పోగు చేశారు. తాను ఏ పాపం ఎరుగనని నవీన్ నెత్తీనోరు బాదుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. నవీన్‌పై ఫిర్యాదు రావడంతో ఎస్ఐ నరసింహుడు రంగంలోకి దిగారు. నవీన్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి చితకబాదాడు. సుగుణమ్మపై దాడి చేసి, చైన్ లాక్కున్నట్లు ఒప్పుకోవాలని చిత్రహింసలు పెట్టాడు. తనకు జరిగిన అన్యాయం గురించి నవీన్ కుటుంబ సభ్యులకు చెప్పి కన్నీరు పెట్టుకున్నాడు. మరోసారి పోలీసులు పిలవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన నవీన్.. సెల్ఫీ వీడియోలో జరిగిందంతా చెప్పి.. ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ సమీపంలోని చింతచెట్టుకు మంగళవారం ఉరి వేసుకున్నాడు.

అవమాన భారంతోనే..

బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు, రాజనోళ్లపల్లికి చెందిన నవీన్ తిరుపతిలో సెక్యూరిటీ గార్డుగా టీటీడీలో పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు. వీరు స్వగ్రామంలోనే ఉంటారు. నవీన్ అప్పుడప్పుడు వచ్చి వెళుతుంటాడు. ఈ క్రమంలో మూడురోజుల క్రితం ఊరికి వచ్చాడు. అదే ఊరికి చెందిన పులిగిండ్లపల్లి సర్పంచ్ సుగుణమ్మను సోమవారం ఉదయం కొట్టి, ఆమె వద్ద ఉన్న ఆరు తులాల బంగారం చైన్‌ను లాక్కెళ్లిపోయాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. సర్పంచ్ సుగుణమ్మ స్వయంగా సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆ వెంటనే పోలీసులు నవీన్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లారు. వైసీపీ నాయకుల ప్రోద్బలంతో నవీన్‌ను స్టేషన్‌లోనే ఎస్ఐ నరసింహుడు చితకబాదాడు. నేరం చేసినట్లు అంగీకరించాలని హింసించాడు. మరుసటి రోజు రావాలని చెప్పి పోలీసులు వదిలిపెట్టడంతో సోమవారం రాత్రి 9.30 గంటలకు నవీన్ ఇంటికి చేరుకున్నాడు. జరిగిన అవమానం గురించి రాత్రి 12.30వరకు కుటుంబ సభ్యులకు చెప్పి బాధపడ్డాడు. తనను పోలీసులు ఎలా కొట్టిందీ భార్య రూపకు చెప్పి, కన్నీరు పెట్టాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలని, ఆధార్ కార్డు తీసి ఉంచమని భార్యకు చెప్పి.. మంగళవారం ఉదయం బయటకు వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు, బంధువులు గాలించారు. గ్రామ సమీపంలోని ఓ చింతచెట్టుకు నవీన్ ఉరి వేసుకుని కనిపించాడు. కిందకు దించి చూసి.. అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మృతదేహాన్ని తీసుకుని తలుపుల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. అనంతరం స్వగ్రామం

(మిగతా 7లో...)



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

రీసర్వేపై అవగాహన కల్పించండి

- కలెక్టర్ చేతన్

ధర్మవరం రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించి, వారి సమక్షంలోనే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పోతులనాగేపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వేను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఏ సర్వేనెంబర్‌లో రీసర్వే చేస్తున్నారని, ఆ రైతులు ఎవరెవరూ ఉన్నారని అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. సర్వే నెంబర్ 114, 153భూమిలో రీసర్వే చేస్తున్నామని, పోతిరెడ్డి, వెంకటరామిరెడ్డి, పెద్దారెడ్డి అనే రైతులు ఉన్నారని అధికారులు తెలిపారు. రైతు కుటుంబ సభ్యుల సమక్షంలోనే రీసర్వే చేయాలని, ఇలాచేస్తే భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు తలెత్తవన్నారు. ఆయన వెంట ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ సురేష్‌బాబు, మండల, గ్రామసర్వేయర్లు, వీఆర్ఓలు ఉన్నారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు

పుట్టపర్తి రూరల్: పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ చేతన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియచేశారు. ఒకటి, రెండు తేదీల్లోనే ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 2,60,156 పింఛన్లతో పాటు కొత్తగా మంజూరైన 4509 వితంతు పింఛన్లను కలిపి పంపిణీ చేస్తామన్నారు. ఇందుకుగాను రూ.115,68,19,500 పింఛన్ మొత్తాన్ని ఈనెలాఖరులోగా సంబంధిత గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్ ఖాతాకు సర్దుబాటు చేస్తామన్నారు. జిల్లాలోని ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు ఈనెల 31న పింఛన్ సొమ్మును బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎరువుల కొరత లేదు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో ఎరువుల కొరత లేదనీ, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతు సేవాకేంద్రాలు, ఎరువుల దుకాణాల్లో తగినన్ని ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. 9.08 టన్నుల యూరియా, 1,531 టన్నుల డీఏపీ, 4,889 టన్నుల కాంప్లెక్సు ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖరీఫ్‌లో జిల్లాలో 52వేల హెక్టార్లలో పంటలు సాగు చేశారన్నారు.

మా బంగారం ఉందో.. లేదో..!

- ఎస్‌బీఐ వద్దకు ఖాతాదారుల పరుగులు
- అధికారులను ఆరాతీస్తున్న వైనం
- చోరీ కేసు దర్యాప్తు ముమ్మరం
- దుండగుల కోసం ఆరు బృందాల గాలింపు



ఎస్‌బీఐ వద్ద గుమిగూడిన ఖాతాదారులు

హిందూపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐలో చోరీతో ఖాతాదారులు ఉలిక్కిపడ్డారు. తాకట్టుపెట్టిన బంగారం చోరీ అయినట్లు అధికారులు ప్రకటించడంతో ఖాతాదారులు పెద్దఎత్తున మంగళవారం బ్యాంకు వద్దకు చేరుకున్నారు. తమ బంగారం ఉందో.. లేదోనని ఆరా తీస్తూ కనిపించారు. పోలీసులు, బ్యాంకు అధికారులు వివరాలు తెలపకపోవడంతో ఖాతాదారులు అయోమయంలో పడ్డారు.

దర్యాప్తు ముమ్మరం

రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఎస్‌బీఐలో చోరీ కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. మండలంలోని తూమకుంట చెక్‌పోస్టు పారిశ్రామిక వాడలోని ఎస్‌బీఐ శాఖలోకి ఈనెల 26న అర్ధరాత్రి దాటాక దుండగులు వెనుకవైపు నుంచి ప్రవేశించారు. లాకర్లలో ఉన్న బంగారం, నగదును ఎత్తుకెళ్లారు. చోరీకి సంబంధించి సోమవారం అర్ధరాత్రి వరకు బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారం వివరాలను పరిశీలించారు. 592 మంది తాకట్టు (మిగతా 6లో...)

బీమా సంకటం..!



- వాతావరణ బీమా ప్రీమియం చెల్లింపుపై అయోమయం
- నెలాఖరు వరకే గడువు
- ఆగస్టు మొదటి వారంలో విత్తనం వేసుకుంటే కట్టేదెలా..?
- పొడిగించాలని రైతుల వేడుకోలు

అనంతపురం అర్బన్/పెద్దవడుగూరు, జూలై29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వాతావరణ బీమా ప్రీమియం చెల్లింపుపై రైతులు అయోమయానికి లోనవుతున్నారు. ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో అరకొరగానే వేరుశనగ, ఇతర రకాల పంటలు సాగయ్యాయి. పదును వర్షం పడితే ఆగస్టు మొదటి వారంలో విత్తనం వేసేందుకు కొందరు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రీమియం ఎలా చెల్లించాలన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. పంట సాగు చేసిన రైతులు మాత్రమే వాతావరణ బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పదును వర్షం పడితే వచ్చే నెలలో వేరుశనగ, కంది ఇతర పంటలు సాగు చేసే రైతుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గడువు పొడిగించాలని వేడుకోలు

వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం చెల్లించేందుకు ఇదివరకు ఈనెల 15వ తేదీ వరకే గడువు ఉండింది. జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగుకు ఇంకా సమయం ఉండటంతో ఈనెల 31వ తేదీదాకా గడువు పొడిగించారు. వాతావరణ ఆధారిత బీమా కింద జిల్లాలో వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు వర్తింపజేశారు. ఆయా పంటలను మండల యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తారు. అల్ప, అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, గాలి వేగం, అధిక ఉష్ణోగ్రతలకు సంబంధించిన పరిణామాలను మండలస్థాయిలో వాతావరణ పరికరాల సహాయంతో లెక్కించి, బీమాను వర్తింపజేస్తారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమాను కింద కంది, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండు మిరప (మిగతా 6లో...)

ముంచిన మిర్చి

గిట్టుబాటు ధర లేక వదిలేసిన రైతు

రూ.16 లక్షల పెట్టుబడికి రూ.12లక్షల నష్టం



తొలగించిన పంటలో కాయలు సేకరిస్తున్న కూలీలు

తనకల్లు, జూలై 29(ఆంధ్రజ్యోతి): అతను ఓ వ్యాపారి, వ్యవసాయం మీద ఆసక్తితో రైతుగా మారి మండలంలోని పెద్దపల్లి గ్రామం వద్ద ఏడు ఎకరాల భూమిని లీజుకు తీసుకుని మిరప పంట సాగు చేశాడు. ఎప్పటికప్పుడు చీడపీడల నివారణకు పురుగుమందులు వాడాడు. పైరు ఎదుగుదలకు మంచి రసాయన ఎరువులు వినియోగించాడు. దీంతో దిగుబడి బాగా వచ్చింది. అయితే ఆశించిన ధరలేక, కొనే వ్యాపారి లేకపోవడంతో మూడు నెలల కిందట సొంతంగా కర్ణాటక రాష్ట్రంలోని వివిధ మార్కెట్లకు తరలించాడు. అయితే అక్కడ కూడా కనీసం కూలీల ఖర్చులు కూడా గిట్టుబాటు కాకపోవడంతో ఈ సేద్యం నావల్ల కాదంటూ పంటను పొలంలోనే వదిలేశాడు. దీంతో రూ.12లక్షలు నష్టం మూటగట్టుకున్నాడు.

రూ.16 లక్షలు పెట్టుబడి పెడితే..

అన్నమయ్యజిల్లా మదనపల్లికి చెందిన చెందిన ఈశ్వరప్ప అనే వ్యాపారి మండలంలోని పెద్దపల్లి వద్ద వ్యవసాయ భూమిని లీజుకు తీసుకున్నాడు. అందులో జెర్సీ 56, దూమ్ రకానికి చెందిన మిరప సాగు చేశాడు. దుక్కి, ఎరువులు, కూలీలు, మొక్కలు, పేపర్, రసాయనిక ఎరువులు ఇలా మొత్తం ఏడు ఎకరాలకు రూ.16లక్షలదాకా పెట్టుబడి పెట్టాడు. సస్యరక్షణ చర్యలు పాటించడంతో మూడు నెలల కిందట మంచి దిగుబడి వచ్చింది. అయితే ఆ సమయంలో మిరపను అడిగేవారే లేరు. దీంతో చింతామణి, బెంగళూరు మార్కెట్‌లకు దిగుబడిని తరలించాడు. అయితే అక్కడ కూలీలు, రవాణా ఖర్చులకు కూడా రాకపోవడంతో పంటను పొలంలోనే వదిలేశాడు. కొంత పంటను అమ్మగా రూ.4లక్షలు మాత్రమే చేతికొచ్చింది. పెట్టుబడిలో రూ.12లక్షలు నష్టం వచ్చినట్లు ఈశ్వరప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. భూయజమానికి ఇవ్వాల్సిన రూ.1.5లక్షలు లీజు చెల్లించి, పంటను పెద్దపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి అనే స్నేహితుడికి ఫ్రీగా అప్పగించాడు.

స్నేహితుడికి గిట్టుబాటు కాని పంట

స్నేహితుడు అప్పగించిన పంటను భాస్కర్‌రెడ్డి కూలీలతో కోయించాడు. ఇందుకుగాను ఒక్కో మహిళా కూలీకి రోజుకు రూ.400లు చెల్లించాడు. అలా కోసిన మిరప పంటను కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి మార్కెట్‌కు తరలించాడు. అక్కడ కిలో రూ.20కి మించి అమ్ముడుపోలేదని, కూలీల ఖర్చులకు కూడా గిట్టుబాటు కాకపోవడంతో ఆయన కూడా పంటను వదిలేశాడు. చుట్టూ కంచె ఉండటంతో తోటలోకి ఎవరు వెళ్లలేదు. భూ యజమాని సోమవారం పంటను తొలగించాడు. దీంతో చుట్టుపక్కల కూలీలందరూ తొలగించిన మిరప చెట్ల నుంచి ఎండు కాయలను విడిపించుకుని తీసుకెళ్లారు. 60మందికి పైగా కూలీలు సొంతగా పొలంలోకి వెళ్లి ఉచితంగా కాయలను విడిపించుకుని వెళ్లారు. ఒక్కరోజే పంట మొత్తం ఖాళీ చేశారు. ప్రస్తుతం ఉన్న ధరలు మూడు నెలల కిందట ఉండి ఉంటే సాగు చేసిన వారికి మంచి లాభాలు దక్కేవని వారు చర్చించుకోవడం కనిపించింది.

సార్..! ధర్మవరానికి రండి

కేంద్ర మంత్రికి సత్యకుమార్ ఆహ్వానం



కేంద్ర మంత్రిని ఆహ్వానిస్తున్న సత్యకుమార్

ధర్మవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దేశరాజధాని న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ధర్మవరంలో మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరినట్లు రాష్ట్ర మంత్రి ప్రకటనలో తెలిపారు. ధర్మవరం నేతన్నలు తయారు చేసిన పట్టు శాలువాను కేంద్రమంత్రికి అందించి, ధర్మవరాన్ని సందర్శించాల్సిందిగా కోరినట్లు తెలిపారు.

విదేశీయుల గానామృతం



కచేరీ నిర్వహిస్తున్న విదేశీ భక్తులు

పుట్టపర్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): విదేశీ భక్తులు గానామృతంతో భక్తులను అలరింపజేశారు. రెండోరోజు మంగళవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో స్పెయిన్, ఇటలీ దేశాలకు చెందిన భక్తులు గానకచేరి నిర్వహించారు. ఆయాదేశాల సంప్రదాయ రీతిలో వాయిద్య గానంతో భక్తులను మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

రొద్దం, జూలై 29(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలం కల్లుకుంట గ్రామంలో మంగళవారం ఆమె అధికారులతో కలిసి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లికి వందనం పథకాన్ని ఎంతమంది పిల్లలున్నా అమలు చేసి ఇచ్చిన మాట నెరవేర్చామన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన అనుభవంతో నేర్పుగా పాలన సాగిస్తున్నట్లు వెల్లడించారు. బీసీల అభ్యున్నతికోసం సబ్సిడీ రుణాలు, ఆదరణ-2 ద్వారా కులవృత్తుల కోసం మరో పథకాన్ని త్వరలో ప్రవేశపెడతామన్నారు. వైసీపీ పాలనలో నాసిరకం మద్యంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో ఏడాదికాలంలోనే దాదాపు రూ.900కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నల్లూరు పంచాయతీ పరిధిలోనే రూ.8కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. కల్లుకుంట గ్రామంలో బస్సు సౌకర్యం, డ్రైనేజీలు, సీసీరోడ్డు వేయాలని స్థానికులు మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, ఎంపీడీఓ రాంకుమార్, పంచాయతీరాజ్ డీఈ వెంకటరమణ, టీడీపీ నాయకులు మాధవనాయుడు, నరహరి, మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య, నారాయణ స్వామి, చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలపై చర్చిస్తున్న మంత్రి సవిత

బలవంతపు భూసేకరణ ఆపాలి

- దళిత సర్పంచ్‌ను మోసం చేసిన వీఆర్ఓపై చర్యలు తీసుకోవాలి
- సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

సోమందేపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగోడు పంచాయతీలో పరిశ్రమల పేరుతో చేపడుతున్న బలవంతపు భూసేకరణను ఆపాలని సీపీఎం నాయకులు ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేపట్టారు. దళిత సర్పంచ్ గంగమ్మను మోసం చేసి పంచాయతీ రిజొల్యూషన్ సర్టిఫికెట్‌పై సంతకం తీసుకున్న వీఆర్ఓ లోకేష్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మారుతికి సర్పంచ్‌తోపాటు రైతులు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తుంగోడు, కొలింపల్లి, కావేటినాగేపల్లి, కూకటిమానుపల్లి, చిన్నబాబయ్యపల్లి, వెలుగమాకులపల్లి గ్రామాలకు చెందిన 300మంది రైతులు గత 55సంవత్సరాలుగా సర్వేనంబరు 28లోగల 1051ఎకరాల్లో భూములు సాగు చేసుకుంటున్నారన్నారు. అసైన్మెంట్ హక్కుల కోసం ఏళ్లుగా పోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వాలు అసైన్మెంట్ ప్రతిపాదనల కోసం సర్వేచేసి సబ్ డివిజన్ చేసినట్లు వెల్లడించారు. ఎనిమిదో విడత భూపంపిణీలో ప్రతిపాదనలు సిద్ధం చేశారని తెలిపారు. అనివార్య కారణాలతో అది నిలిచిపోగా ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో అధికారులు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏకంగా ఎక్స్‌కవేటర్‌తో భూమి చదును చేస్తూ, దొంగచాటుగా భూసేకరణలకు పూనుకోవడం దారుణమన్నారు. సెల్‌టవర్ల కోసం అంటూ వీఆర్ఓ లోకేష్, వీఆర్ఏ అంజినప్ప తన ఇంటివద్దకు వచ్చి పంచాయతీ రెజొల్యూషన్ పేపర్‌పై సంతకాలు తీసుకున్నారని సర్పంచ్ గంగమ్మ తహసీల్దార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమయ్య, నాగభూషణం, రామకృష్ణ, తుంగోడు మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, సర్పంచ్ గంగమ్మ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం

ఆ దిశగానే నేడు జిల్లాలో రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కూటమిని, సంస్థాగతంగా బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన సాగుతుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పీవీఎన్ మాధవ్ తొలిసారి జిల్లాకు వస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న తర్వాత 10.30గంటలకు కృష్ణకళామందిరం నుంచి నగరంలో శోభా యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం లలితకళా పరిషత్తులో సభకు హాజరవుతారు. సాయంత్రం 4గంటలకు ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మీడియా సమావేశం, 5గంటలకు సాయినగర్‌లో చిట్‌చాట్, 6గంటలకు మేధావులతో సమావేశంలో పాల్గొంటారు. ఈ పర్యటనలో ప్రజల నుంచి సూచనలు, సలహాలు సేకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక అందజేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు చిరంజీవిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రత్నమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, కార్యదర్శి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ఆనందం

2న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము జమకు సన్నాహాలు

అనంతపురం అర్బన్/కొత్తచెరువు, జూలై 29(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్మును ప్రభుత్వం జమ చేయనుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతనెల 20వ తేదీన అన్నదాత సుఖీభవ సొమ్మును రైతుల ఖాతాలకు జమ చేయాలని భావించారు. అనివార్య కారణాల నేపథ్యంలో వాయిదా పడింది. ఎట్టకేలకు ఆగస్టు 2వ తేదీన అన్నదాత సుఖీభవ సొమ్మును రైతుల ఖాతాలకు జమ చేయాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులు.. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి మౌఖిక సమాచారం అందించారు. అనంత జిల్లాలో 2,79,171 మంది రైతులు అన్నదాత సుఖీభవకు అర్హులుగా గుర్తించారు. వీరిలో 2,64,471 మంది రైతుల బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ సవ్యంగా ఉంది. వీరందరికి నేరుగా సొమ్ము జమవుతుంది. మిగిలిన 14,701 మందికి ఆధార్ లింకేజీ లేకపోవడం, మ్యాపింగ్ చేయించకపోవడంతో పెండింగ్ జాబితాలో పెట్టారు. వీరిలో తాజాగా 400 మంది ఆధార్ లింక్ పూర్తి చేసుకున్నారు. మిగిలిన రైతులు కూడా చేయించుకుంటే అన్నదాత సుఖీభవ సొమ్ము జమవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. జిల్లాలో పీఎం కిసాన్ కింద 2.68 లక్షల మంది రైతులను అర్హులుగా గుర్తించారు.

తొలి విడతలో జమకానున్న సొమ్ము

వైసీపీ హయాంలో ఏడాదికి రూ.13500 రైతుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో, కేంద్రం మూడు విడతల్లో జమ చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.7500, కేంద్ర ప్రభుత్వం వాటా రూ.6000 జమ చేస్తూ వచ్చారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రస్తుత సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు జమ చేసేందుకు సిద్ధమయ్యారు. ఏడాదిలో మూడు విడతలుగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము జమ చేయాలని నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.14వేలు, కేంద్రం నుంచి రూ.6వేలు జమ చేయనున్నారు. ఈ ఏడాది తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2వేలు, రెండో విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు, మూడో విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.4వేలు, కేంద్రం రూ.2వేలు జమ చేయనున్నాయి. ఈ ఏడాది తొలి విడత ఆగస్టు 2వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5వేలు, కేంద్రం నుంచి రూ.2వేలు జమ కానుంది. ఒక్కో రైతుకు మొత్తం రూ.7వేలు జమ కానుంది.

శ్రీసత్యసాయి జిల్లాలో..

శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద ప్రస్తుతం 5,16,706 మంది రైతులు లబ్ధి పొందనున్నారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు పేర్కొన్నారు. ఇందులో పీఎం కిసాన్ కింద 2,58,432 మంది, అన్నదాత సుఖీభవ కింద 2,61,274 మంది ఖాతాల్లోకి ఆగస్టు 2న రూ.7 వేల చొప్పున జమ చేయనున్నారు.

చెరువులా.. చిట్టడవులా..?

చెరువులు, కుంటల్లో పెరిగిన ముళ్ల పొదలు

తొలగింపు ప్రక్రియ చేపట్టని అధికారులు

నీటి నిల్వ లేక ఇబ్బంది పడుతున్న రైతులు

నల్లమాడ, జూలై 29(ఆంధ్రజ్యోతి): నిర్వహణ లేకపోవడంతో నియోజకవర్గంలోని పలు చెరువులు కంపచెట్లతో నిండిపోయాయి. పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపి సాగు భూములను సస్యశ్యామలం చేస్తామని గత, ప్రస్తుత పాలకులు హామీలు ఇచ్చారు. కానీ ఇవన్నీ ఆచరణకు నోచుకోలేదు. నియోజకవర్గంలో 193 చెరువులను నింపడంతోపాటు రెండు రిజర్వాయర్లు నిర్మాణం కోసం గత ప్రభుత్వంలోనే రూ.864కోట్లతో పరిపాలన అనుమతులు లభించాయి. అయితే పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ప్రస్తుత ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి 193 చెరువులకు నీరు నింపాలన్న లక్ష్యంతో ప్రభుత్వాన్ని ఒప్పించి పనులు కొనసాగేలా అనుమతులు పొందారు.



ముళ్లకంపలతో నిండిన కుటాలపల్లి చెరువు

పెరిగిన ముళ్ల పొదలు

నీరు నిల్వ ఉండాల్సిన చెరువుల్లో ప్రస్తుతం భారీగా తుమ్మచెట్లు, ఇతర ముళ్ల పొదలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో రూ.864కోట్లు నిధులు మంజూరైనా, చెరువుల మరమ్మతు, అభివృద్ధి పనులు చేపట్టలేదు. గత ప్రభుత్వంలో కొన్ని కుంటలు, చెరువుల్లో మట్టి, ఇసుకను తొలగించి, కొంత మంది నాయకులు సొమ్ము చేసుకున్నారు. అయితే అప్పటి అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా నియోజకవర్గంలోని 193 చెరువులను నీటితో నింపుతామని చెబుతున్నారేకానీ, రెండుదశాబ్దాలుగా చెరువుల్లో పెరిగిన తుమ్మచెట్లను తొలగించడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. గత టీడీపీ పాలనలో మాదిరే ప్రస్తుతం కూడా జంగిల్ క్లీనింగ్ పేరుతో కుంటలు, చెరువుల్లో ముళ్లపొదలను, పూడికతీత పనులు చేపట్టాలని కోరుతున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువులు, కుంటల్లోని ముళ్ల పొదలు విషపురుగులకు ఆవాసాలుగా మారాయి. ప్రస్తుత ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఈ సమస్యలపై దృష్టి పెట్టి, పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

చెరువు నిండా ముళ్లకంపలే



కుటాలపల్లి సమీపంలో పెద్దచెరువు ఉంది. ఈచెరువు నిండా ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. 15 ఏళ్ల కిందట చెరువులో ముళ్ల పొదలు తొలగించారు. తర్వాత పట్టించుకోలేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని చెరువులో ఉన్న ముళ్లకంపలను తొలగిస్తే వర్షాకాలంలో అయినా నీరు నిల్వ ఉండే అవకాశం ఉంది. అధికారులు, నాయకులు స్పందించి చెరువులోని ముళ్ల పొదలు తొలగింపజేయాలి.

-సోముశేఖర్‌రెడ్డి, రైతు, కుటాలపల్లి

పూడిక తీయాలి



నల్లమాడకు సమీపంలో ఓ పెద్ద కుంట ఉంది. ప్రసుత్తం వర్షాకాలంలో కుంటలో ఉన్న ముళ్లపొదలను తొలగించడంతో పాటు పూడిక తీయాల్సిన అవసరం ఉంది. కుంటలో నీరు నిల్వ ఉంటే పశువుల తాగునీటికి ఇబ్బంది ఉండదు. కట్టపైన ఏపుగా చెట్లు పెరగడంతో కుంట కనిపించకుండా పోయింది. అధికారులు, నాయకులు స్పందించి కుంటలో ముళ్లపొదలు తొలగింపజేయాలి.

-అగ్గిరాములు, రైతు, నల్లమాడ

బీమా సంకటం..!

(5వ పేజీ తరువాయి)

పంటలకు వర్తింపజేశారు. వరికి ఆగస్టు 15 వరకు, మిగతా పంటలకు నెలాఖరులోగా ప్రీమియం చెల్లించాలని గడువు విధించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద కంది పంటను గ్రామం యూనిట్‌గా, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరప పంటలను మండలం యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. పంట కోత ప్రయోగాల ద్వారా లెక్కించిన వాస్తవ దిగుబడిని, గత 7 సంవత్సరాలుగా వచ్చిన దానిని లెక్కిస్తారు. ఆ మేరకు దిగుబడి తగ్గినపుడు బీమా వర్తింపజేస్తారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా వాతావరణ ఆధారిత బీమా కింద 1,59,100 మంది రైతులు 1.47 లక్షల హెక్టార్లకు, ఫసల్ బీమా కింద (దిగుబడి ఆధారిత) 10,194 మంది రైతులు 8,662 హెక్టార్లకు ప్రీమియం డబ్బు చెల్లించారు.

అరకొరగానే పంటల సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా సరాసరి సాధారణ సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లు, కంది 55,296, పత్తి 44 వేలు, ఆముదం 16,293, వరి 19,466, జొన్న 1,719, సజ్జ 2,054, మొక్కజొన్న 14,653, రాగి 69, కొర్ర 3311, పెసలు 455 హెక్టార్లు. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలున్నాయి. ఈసారి ఆశించిన స్థాయిలో వానలు పడకపోవడంతో అరకొరగానే పంటలు సాగయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా 1.07 లక్షల హెక్టార్లలో (31 శాతం) మాత్రమే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 38,104 హెక్టార్లలో మాత్రమే విత్తారు. మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, ఆముదం, పత్తి, సజ్జల పంటలు సాగు చేశారు. నెలాఖరులో పదును వర్షం పడితే వచ్చే నెలలో పంటలు సాగుచేసే పరిస్థితులు ఉన్నందున వాతావరణ, ఫసల్ బీమా ప్రీమియం చెల్లింపు గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రీమియం గడువు పెంచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వర్షం కురవక పంట వేయలేకపోయా..:



ఈసారి పదును వర్షం పడకపోవడంతో వేరుశనగ పంట సాగు చేయలేకపోయా. పదును వర్షం పడితే వేరుశనగ పంట విత్తేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటి దాకా ఈనెల 15 వరకు వాతావరణ బీమా ప్రీమియం కట్టేందుకు గడువు విధించారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున నెలాఖరు వరకు పొడిగించారు. వచ్చే నెలలో పంట సాగు చేసే రైతులు ప్రీమియం కట్టేందుకు అవకాశం ఉండదు. దీనిని దృష్టిలో ఉంచుకుని, మరికొన్ని రోజులు ప్రీమియం చెల్లించేందుకు గడువు పొడిగిస్తే బాగుంటుంది.

-నాగిరెడ్డి, రైతు, పెద్దవడుగూరు

ఇదివరకే ఒకసారి పొడిగించారు

వాతావరణ బీమా ప్రీమియం చెల్లించేందుకు ఇదివరకు ఈనెల 15వ తేదీదాకా గడువు ఉండింది. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, పంటలు సాగు చేసే పరిస్థితి ఉన్నందునే నెలాఖరు దాకా పొడిగించారు. పంట సాగు చేసిన రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించాలి. ఈ-పంట నమోదు ఆధారంగా పంట సాగు చేసిన రైతుల్లో ప్రీమియం చెల్లించిన వారికే పంట నష్టం వాటిల్లినపుడు బీమా వర్తింపజేస్తారు.

-ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

అన్నా..! మీ పిల్లల్ని బడికి పంపండి

తల్లిదండ్రులకు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి వినతి

అడ్మిషన్ల కోసం ఇంటింటికీ తిరుగుతున్న శంకర్

తన బైకుపైనే పిల్లలను స్కూలుకు తెస్తున్న వైనం



విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో కల్పించే సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్న టీచర్

శెట్టూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): అతడో ప్రభుత్వ ఉపాధ్యాయుడు. పాఠశాలకు వెళ్లి వస్తే చాలు, పిల్లలకు చదువు చెప్పినా చెప్పకపోయినా నెల తిరిగేసరికి జీతం ఆయన అకౌంట్‌లో పడుతుంది. బయటకు కాలు కదపకుండా హాయిగా బడిలోనే కూర్చోవచ్చు. వచ్చిన పిల్లలకు ఓపికుంటే పాఠాలు చెప్పవచ్చు లేదంటే ఏదో ఒకటి రాసుకోమనవచ్చు. కానీ ఆ మాస్టారు అలా చేయలేదు. ఓ వైపు బడికి వచ్చిన పిల్లలకు చక్కగా చదువు చెబుతూ, వారి సంఖ్యను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇందు కోసం గ్రామంలో ఇల్లిల్లూ తిరుగుతున్నా డు. తల్లిదండ్రులతో మాట్లాడి వారి పి ల్లలను బడిలో చేర్పేలా చైతన్యం కల్పిస్తున్నాడు. మీ పిల్లలను చక్కగా చదివించే పూచీ నాది అంటూ వారికి హామీ ఇస్తున్నాడు. ఆయనే శెట్టూరు మండలం బసంపల్లి ప్రాథమి క పాఠశాల ఉపాధ్యాయుడు శంకర్.

ఎంఈఓతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ..

ఇటీవల జరిగిన బదిలీల్లో కంబదూరు మండలం రాళ్లపల్లి నుంచి ఉపాధ్యాయుడు శంకర్ బసంపల్లికి వచ్చాడు. ఇది ఏకోపాధ్యాయ పాఠశాల. ఆయన బదిలీపై వచ్చిన సమయంలో పాఠశాలలో ఐదుగురు పిల్లలు మాత్రమే ఉన్నారు. గ్రామంలో మిగతా పిల్లలను ప్రభుత్వ బడికి కాకుండా ప్రైవేటు పాఠశాలలకు పంపుతుండటాన్ని చూసి పరిస్థితిని మార్చాలని సంకల్పించాడు. ఈక్రమంలోనే ఎంఈఓ శ్రీధర్‌తో కలిసి గ్రామంలో ఇల్లిల్లూ తిరుగుతూ ప్రభుత్వ బడిపై భరోసా కల్పించాడు. దీంతో మరి కొంతమంది పిల్లలు పాఠశాలలో చేరారు. దీంతో వారికి చక్కగా విద్యా బోధన చేయడం ప్రారంభించాడు. ఎవరైనా పిల్లలు రాకపోతే తన బైకుపై వారి ఇంటికి వెళ్లి ఏమైందో కనుక్కుని వారిని స్కూలుకు తీసుకొస్తున్నాడు. ప్రస్తుతం బసంపల్లి ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో ఆరుగురు, రెండో తరగతి ఐదుగురు, మూడో తరగతిలో ఒకరు చదువుతున్నారు. గత ఏడాది కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు.

ఇంగ్లిష్ నేర్పిస్తా

పేద పిల్లల చదువు కోసం ప్రభుత్వం లక్షల రూపాయాల ప్రజాధనాన్ని ఖర్చు పెడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే టీచర్లు అందరూ కూడా ఉపాధ్యాయ శిక్షణ పొందినవారే. అందరికీ మంచి పరిజ్ఞానం ఉంటుంది. మంచి విద్యా బోధన చేస్తారు. ఇప్పుడు ఇంగ్లిష్ మీడియం కూడా ఉంది కాబట్టి తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ బడికి పంపాలి. నేను ఆర్ఈవో ఇంగ్లిష్ బోధనపై బెంగళూరులో శిక్షణ పొందా. దక్షిణ భారతదేశంలో అత్యున్నత శిక్షణ కళాశాలలో ఆంగ్ల భాషపై శిక్షణ పొందా. మొత్తం 170 మంది శిక్షణలో పాల్గొనగా 13 మంది మాత్రమే ఏ ప్లస్ సాధించారు. అందులో నేను ఒకడిని. ఇక్కడి విద్యార్థులకు చక్కని ఇంగ్లిష్ నేర్పిస్తా.



-శంకర్, పాఠశాల ఉపాధ్యాయుడు

సహకరిస్తాం

: తిమ్మరాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, బసంపల్లి

ఉపాధ్యాయుడు శంకర్ మా ఊరి బడికి రావడం మా అదృష్టం. ఆయన ప్రత్యేక చొరవతో పాఠశాలలో అడ్మిషన్లు పెరిగాయి. పిల్లలకు చక్కగా బోధిస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తా.

ప్రైవేటు నుంచి..

నా కొడుకుని ప్రైవేటు పాఠశాలలో చదివిస్తుండేవాడిని. ఉపాధ్యాయుడు శంకర్ మా ఊరికి వచ్చిన తర్వాత ప్రభుత్వ బడిపై మాకు నమ్మకం కలిగించాడు. ఆయన బోధన, పిల్లలతో ప్రవర్తించే తీరు చూశాక నా కొడుకును ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నా.

-మల్లెల మహేంద్ర, విద్యార్థి తండ్రి, బసంపల్లి

ఈ-పంట నమోదు ఆరంభం

సెప్టెంబరు 15వరకు గడువు

ఇప్పటి వరకు 21 మండలాల్లో 1038 ఎకరాల నమోదు



ఉరవకొండ మండలం పెద్దముష్టూరులో ఈ పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ (ఫైల్)

అనంతపురం అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఈ పంట నమోదు ప్రక్రియ ఎట్టకేలకు మొదలైంది. గత రెండు రోజులుగా జిల్లాలోని పలుప్రాంతాల్లో ఈ పంట నమోదు ఆరంభించారు. ఇప్పటి దాకా 21 మండలాల్లోని పలు గ్రామాల్లో 1038 ఎకరాలు ఈ పంట నమోదు చేశారు. సెప్టెంబరు 15 వరకు ఈ పంట నమోదుకు గడువు విధించారు. సెప్టెంబరు 19నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి, ముసాయిదా ఈ పంట జాబితాను ప్రదర్శిస్తారు. అదే నెల 25 నుంచి 28 వరకు ఈ పంట జాబితాపై అభ్యంతరాలు, అర్జీలు స్వీకరిస్తారు. సెప్టెంబరు 30న ఈ పంట తుది జాబితాను విడుదల చేస్తారు. జియోకోఆర్డినేట్స్ ద్వారా పొలంలో రైతును నిలుచోబెట్టి ఫొటో తీసి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గతంలో 50 మీటర్ల దూరం వరకు జియోకోఆర్డినేట్స్‌తో ఫొటో తీసేందుకు అవకాశం ఉండేది. ఈ సారి 5.1 వర్షన్‌లో 20 మీటర్ల దూరానికి కుదించారు.

కొత్త నిబంధనతో ఇబ్బందే..!

ఈ పంట నమోదులో ఈ సారి కొత్త నిబంధన విధించారు. గతంలో సాగు చేసిన పంట పొలాల్లో ఈ పంట నమోదు చేస్తూ వచ్చారు. ఈ ఏడాది సరికొత్తగా పంటలు సాగు చేయని పొలాలను నమోదు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా సరాసరి సాధారణ సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లు, కంది 55296, పత్తి 44వేలు, ఆముదం 16293, వరి 19466, జొన్న 1719, సజ్జ 2054, మొక్కజొన్న 14653, రాగి 69, కొర్ర 3311, పెసలు 455 హెక్టార్లు. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 1.07 లక్షల హెక్టార్లల్లో (31 శాతం) వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 38104 హెక్టార్లల్లో సాగు చేశారు. మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, ఆముదం, పత్తి, సజ్జల పంటలు సాగు చేశారు. ఈ సారి సాగు చేసిన పంట పొలాలతోపాటు పంటలు సాగు చేయకుండా బీడుగా ఉంచిన రైతుల వివరాలు నమోదు చేయాలని ఆదేశించడంతో సిబ్బంది అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. పంట సాగు చేసిన వివరాలు నమోదు చేస్తే.. మిగతా విస్తీర్ణంలో పంట సాగు చేయలేదని స్పష్టంగా తెలుస్తుంది. అలాంటప్పుడు బీడుగా ఉన్న పొలాలను ఈ పంటలో నమోదు చేయడం ఎందుకు అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు ఒక గ్రామంలో పంట వేసిన పొలం వద్దకు ఈ పంట నమోదుకు వెళ్లిన సమయంలో సమీపంలో బీడు పొలం ఉంటే పంట వేయలేదని నమోదు చేసుకునే పరిస్థితి ఉంటుంది. వర్షాభావ పరిస్థితుల్లో జిల్లాలో ఈ సారి ఎక్కువ శాతం పంట సాగు చేయలేదు. అలాంటి వారంతా వచ్చే నెలలో వర్షం పడితే విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం బీడుగా ఉందన్న కారణంతో ఈ పంట నమోదులో పంట సాగు చేయలేదని నమోదు చేస్తే.. వచ్చే నెలలో పంట సాగు చేసే రైతుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదే జరిగితే రైతులు నష్టపోయే ప్రమాదం లేకపోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి, నిర్ణయం తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

మా బంగారం ఉందో.. లేదో..!

(5వ పేజీ తరువాయి)

పెట్టిన 10 కేజీల బంగారం ఎత్తుకెళ్లినట్లు బ్యాంకు అధికారులు, పోలీసులు నిర్ధారించారు. మరికొన్ని ఆభరణాలు కరిగిపోయాయి. అవి 2 కేజీల దాకా ఉండవచ్చని భావిస్తున్నారు. చోరీని పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించి, కేసు దర్యాప్తు ముమ్మరం చేయించారు.

ఆరు బృందాల గాలింపు

చోరీ కేసు దర్యాప్తులో భాగంగా దుండగులను పట్టుకునేందుకు ఆరు బృందాలు గాలింపునకు వెళ్లాయి. ఇందులో కర్ణాటక, తమిళనాడు, ఉత్తరాది రాష్ట్రాలకు తరలి వెళ్లారు. గతంలో ఇతర రాష్ట్రాల్లోగానీ, ఏపీలోగానీ ఈ తరహా బ్యాంకు చోరీలను గుర్తించి, అప్పట్లో వాటికి పాల్పడిన దుండగులెవరన్నది ఆరాతీస్తున్నారు. చోరీ ప్రాంతంలో కొత్త షూ, సాక్ష్యు లభ్యమయ్యాయి. అవి చోరీకి వచ్చినవారివా, ఇతరులవా అని తెలియాల్సి ఉంది. ఆ షూ ఎక్కడ కొనుగోలు చేశారన్నది పోలీసులు ఆరాతీస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి డీఎస్పీ మహేష్, సీఐలు బ్యాంకు వద్దే ఉండి ఆ ప్రాంతాల్లో ఇటీవల ఎవరైనా కొత్త వ్యక్తులు తిరిగారా అని అడిగి తెలుసుకుంటున్నారు. మంగళవారం రాత్రి వరకు కేసులో ఎలాంటి పురోగతి కనిపించలేదు.

సీసీ టీవీ పుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

చోరీ కేసు ఛేదింపులో సాంకేతికపరమైన అంశాలు కీలకం. శనివారం రాత్రి బ్యాంకు చుట్టుపక్కల ప్రాంతా ల్లో సీసీ టీవీ పుటేజీలతోపాటు బెంగళూరు, హిందూపురం వైపు గోళ్లాపురం మీదుగా ఆ సమయంలో వెళ్లిన వాహనాలు ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. చోరీకి ఎంతమంది వచ్చారన్నది పోలీసులు నిర్ధారించలేకపోయారు. సీసీ టీవీ పుటేజీలో ఒక దుండగులు మాస్క్ ధరించి, చేతులకు గ్లౌ వేసుకోవడంతో అతడిని గుర్తించడం ఇబ్బందికరంగా మారింది. చోరీ అనంతరం బయటకు వెళ్లినపుడు మాస్క్ తీశాడా అన్నది పోలీసులు గమనిస్తున్నారు. రెండు, మూడు రోజులుగా తూమకుంట చెక్‌పోస్టులో కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చారా అన్నది పోలీసులు ఆరాతీస్తున్నారు. పారిశ్రామిక వాడ ఉండటంతో పనిచేస్తున్న వారిలో 90శాతం మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారే. దీంతో స్థానికులెవరో, బయటి వ్యక్తులెవరో గుర్తించడం కష్టతరంగా మారింది. ఆ సమయంలో బ్యాంకు ప్రాంతంలో సాంకేతికపరంగా ఫోన్‌కాల్స్‌ను పరిశీలిస్తున్నారు. చోరీకి వచ్చిన దుండగులు ఫోన్లు వాడారా, లేదా అన్నది తెలియాల్సి ఉంది. ఇదే తరహా చోరీలు తెలంగాణ రాష్ట్రం వరంగల్లు జిల్లా రాయపర్తిలోని ఎస్‌బీఐ శాఖలో, కర్ణాటకలోని దావణగెరెలో సైతం ఇలాగే జరిగినట్లు పోలీసుల ద్వారా తెలిసింది.

ఎస్పీ పరిశీలన

తూమకుంట చెక్‌పోస్టులోని ఎస్‌బీఐ శాఖలో భారీ చోరీ జరిగిన నేపథ్యంలో మంగళవారం సాయం త్రం ఎస్పీ రత్న పరిశీలించారు. బ్యాంకు చుట్టుపక్కల ప్రాంతా లు పరిశీలించారు దుండగులు ఎలా ప్రవేశించారు, బయటకు వెళ్లిన దారి తదితర వివరాలను ఎస్పీ ఆరాతీశారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు.



సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

జీడిపల్లి రిజర్వాయర్‌కు 1,463 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జూలై29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు మంగళవారం 1,463 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.521 టీఎంసీల నీరు నిల్వ ఉందని వెల్లడించారు.

టమోటా కిలో రూ.44

అనంతపురం రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.44తో అమ్ముడుపోయాయి. టమోటా కిలో కనిష్ఠ ధర రూ.30, సరసరా ధర రూ.37తో విక్రయాలు జరిగాయి. మొత్తంగా మార్కెట్‌కు 3,450 టన్నుల టమోటా కాయలు వచ్చాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణానికి వేగంగా చర్యలు

తిరుపతి సమీక్షలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కూటమి ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు వేగవంతంగా చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. తిరుపతిలోని సంస్కృత విద్యాలయంలో రాయలసీమ జిల్లాల ఆర్టీసీ అధికారులు, డీఎంలతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావులతోపాటు కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు పాల్గొన్నారు. పూల నాగరాజు మాట్లాడుతూ... ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి బస్సు షెడ్యూల్, రూట్ మ్యాపింగ్, టికెట్ విధానం, డిజిటల్ ట్రాకింగ్ వంటి అంశాలపై పూర్తి క్లారిటీ ఉండాలన్నారు. మహిళలకు భద్రతతోపాటు ప్రత్యక సౌకర్యాలు కల్పించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న ఆర్టీసీ ఎండీ, మంత్రి, పూల నాగరాజు

క్రైం కార్నర్

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి

విడపనకల్లు, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి గ్రామానికి చెందిన రైతు మహేష్ గౌడ్ (65) చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. పాల్తూరు ఎస్ఐ మురహరిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహేష్‌గౌడ్ తనకున్న 2.5 ఎకరాల పొలంలో వివిధ రకాల పంటలు సాగు చేస్తుండేవాడు. పంటలు పండక పెట్టుబడులు కూడా గిట్టక అప్పులు రూ.6.5లక్షలకు పెరిగాయి. వాటిని ఎలా తీర్చాలో దిక్కుతోచక ఈనెల 15వ తేదీన సొంత వామి దొడ్డిలోకి వెళ్లి పురుగుల మందు తాగి, ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బళ్లారిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ 24వ తేదీ వరకూ చికిత్స పొందాడు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. రైతు భార్య హంపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రైతుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. కూలీ మృతి


వినోద్‌కుమార్ (ఫైల్)

తాడిపత్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామ సమీపంలో ట్రాక్టర్ కిందపడి వినోద్‌కుమార్ (26) మృతి చెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. కూలి పనులు చేసుకుని జీవించే వినోద్‌కుమార్ రోజూ మాదిరిగానే మంగళవారం కూడా ట్రాక్టర్ పనులకు కూలికి వెళ్లాడు. మట్టి వేసుకొని వెళుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో కిందపడిన వినోద్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య శ్వేత, కుమారుడు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెళ్లయిన ఎనిమిది నెలలకే..

మనస్పర్థలతో దంపతుల ఆత్మహత్య


మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ, ఎస్ఐ నబీరసూల్

బొమ్మనహాళ్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మనస్పర్థలతోనే నేమకల్లులో దంపతులు సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలను రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ నబీరసూల్ మంగళవారం వెల్లడించారు. వారు తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ పట్టణానికి చెందిన రెహమాన్(25), హొస్పేట్ తాలూకా నాగేనహళ్లి గ్రామానికి చెందిన ఆఫ్రీనా(21) రెండేళ్ల కిందట ప్రేమించు కున్నారు. రెండు కుటుంబాల పెద్దలను ఒప్పించి, ఎనిమిది నెలల కిందట పెళ్లి చేసుకున్నా రు. జీవనం కోసం నాలుగు నెలల కిందట నేమకల్లు గ్రామానికి వచ్చారు. అక్కడే ఆర్యవైశ్య కాంప్లెక్స్‌లో ఓ గదిని అద్దెకు తీసుకోని జీవించసాగారు. వీరితో పాటు ఆఫ్రీనా సోదరుడు శాబాషా కూడా ఉంటున్నాడు. కొద్ది రోజులుగా రెహమాన్ తాగుడుకు బానిసయ్యాడు. దీంతో దంపతుల మధ్య మ నస్పర్థలు ఏర్పడ్డాయి. వారం కిందట ఆఫ్రీనా స్వగ్రామానికి సోదరుడితో క లిసి వెళ్లింది. సోమవారం తిరిగి నేమకల్లుకు వచ్చింది. భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో ఇద్దరూ ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాలకు బళ్లారి విమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

దొంగతనం కేసు నిందితుడి అరెస్ట్

పెనుకొండ టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పరిగి మండలంలో ఇటీవల పలు ఇళ్లలో చోరీకి పాల్పడి నగదు, బంగారం అపహరించిన నిందితుడు బోయరాజును అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ నర సింగప్ప తెలిపారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పరిగి మండలం గొర్రెపల్లి క్రాస్ సమీపంలో బోయరాజును అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.10లక్షలు విలువచేసే 13తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని రొద్దం మండలం శేషాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇతను కర్ణాటకలో నివాసముంటూ అక్కడ కూడా పలు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. కర్ణాటక ప్రాంతంలో ఇతడిపై 12కేసులున్నాయన్నారు. మరోవ్యక్తి చిన్నప్పరెడ్డి దొంగతనాలకు పాల్పడినవారిలో ఉన్నారని పుట్టపర్తిలో ఒక కేసులో జుడీషియల్ కస్టడీలో ఉన్నారని, అతన్నికూడా కస్టడీలో తీసుకుని విచారించి దొంగతనం చేసిన బంగారం రికవరీ చేస్తామన్నారు. వీరిని కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

గొలుసు దొంగతనం కేసులో..

గుంతకల్లు టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డు, విజయనగర్ కాలనీ, గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లిలో మహిళల మెడలోని బంగారు గొలుసులను లాక్కున్న దుండగుడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ మనోహర్ వెల్లడించారు. కంబదూరు మండలం వెంకటాంపల్లికి చెందిన ఎనుముల మారుతీప్రసాద్ స్కూటర్‌పై వచ్చి జూన్ 7వ తేదీ ఆలూరు రోడ్డులోని సాయిబాబా దేవాలయం వద్ద నివాసముంటున్న రాయల పుష్పవతి మెడలో బంగారు చైన్ లాక్కెళ్లాడు. ఈనెల 17న విజయనగర్‌కాలనీలో నివాసముంటున్న బోయ మల్లీశ్వరి మెడలోని, గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లిలో మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వన్‌టౌన్ సీఐ మనోహర్, సీసీఎస్ సీఐలు శేషగిరి, జైపాల్‌రెడ్డి, ఎస్ఐ వలిబాషా, వన్‌టౌన్ ఎస్ఐ కొండయ్యకు రాబడిన సమాచారం మేరకు కొనకొండ్ల రోడ్డులోని బీమా పార్క్ వద్ద అతడిని అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.7.50 లక్షల విలువచేసే 71 గ్రాముల బరువున్న మూడు బంగారు గొలుసులు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పట్టణంలోని హనుమేష్ నగర్, గుట్టల ఏరియాలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. వారి నుంచి రూ.10 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

కూటమి ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్త బలి

(5వ పేజీ తరువాయి)

రాజనోళ్లపల్లికి మృతదేహాన్ని తీసుకువెళ్లి సర్పంచ్ సుగుణమ్మ ఇంటిముందు బైఠాయించారు. పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నవీన్ భార్య ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేశామని రూరల్ సీఐ నాగేంద్ర తెలిపారు. సర్పంచ్ సుగుణమ్మ, ఆమె బంధువులు, కుటుంబ సభ్యులు రాజనాల సుబ్బారెడ్డి, రఘునాథరెడ్డి (తలుపుల సాక్షి విలేకరి), వాసుదేవరెడ్డి, గంగులమ్మ, చందు, విశ్వనాథరెడ్డిపై 306 సెక్షన్ కింద కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితులలో ఇద్దరు తమ అదుపులో ఉన్నారని, మిగిలినవారి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

దగ్గరుండి కొట్టించారు..

నవీన్‌ను తలుపుల స్టేషన్‌కు తీసుకువెళ్లిన తరువాత నేరం ఒప్పుకోవాలని ఎస్ఐ నరసింహుడు చితకబాదాడని బంధువులు వాపోయారు. జరిగిన సంఘటన గురించి సీఐ నాగేంద్రకు వివరించారు. వైసీపీకి చెందిన పలువురు నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఉండి, ఎస్ఐని రెచ్చగొట్టి మరీ కొట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్ల, చేతులు కట్టేసి కొట్టారని నవీన్ ఆ రాత్రి కన్నీరు పెట్టుకున్నాడని, జరిగిన అవమానాన్ని తలచుకుని కుమిలిపోయాడని అన్నారు. గొలుసు పోయిందని చెప్పినప్పుడు తాము సర్పంచ్ ఇంటి వద్దే ఉన్నామని, తన భర్తను, బైకును అందరూ తనిఖీ చేసినా చైన్ దొరకలేదని రూప కన్నీరుమున్నీరయ్యారు. బైకు అక్కడే ఉంచాలని సర్పంచ్ బంధువులు చెప్పడంతో అక్కడే పెట్టి వెళ్లిపోయామని, ఆ తరువాత పోలీసులు వచ్చి తమ బైకును తనిఖీ చేయగానే చైన్ బయటపడిందని అన్నారు. ఇలా ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పోలీసులు తన భర్తను తీవ్రంగా కొట్టి అవమానించారని బోరున విలపించారు. విషయం తెలియగానే వడ్డెర సంఘం నాయకులు కదిరి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకుని బైఠాయించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వైసీపీవారే హత్య చేశారు: రూప

తన భర్త నవీన్‌ను వైసీపీకి చెందిన సర్పంచ్ సుగుణమ్మ, ఆమె బంధువులు హత్య చేశారని రూప పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్తపై దొంగతనం కేసు మోపారని, ఎస్ఐ చేత చితకబాదించారని పేర్కొన్నారు. సర్పంచ్ సుగుణమ్మ బంధువులు సోమవారం రాత్రి తమ ఇంటివద్దకు వచ్చి, తన భర్తను చంపేస్తామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని, సర్పంచ్ బంధువులే హత్య చేశారని ఫిర్యాదు చేశారు. తనకు ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నాడని, తమ భవిష్యత్తు ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తను కొట్టిన ఎస్ఐపైన, హత్య చేసిన సర్పంచ్, ఆమె బంధువులపైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

రాజకీయాలే కారణమా..?

నవీన్ ఆత్మహత్యకు రాజకీయాలే కారణమని అతని బంధువులు చెబుతున్నారు. గత ఎన్నికలలో టీడీపీ మద్దతుతో నవీన్ తల్లి ప్రమీల సర్పంచ్‌గా పోటీ చేశారు. నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని చివరి నిమిషం వరకు ప్రమీలపై సుగుణమ్మ బంధువులు ఒత్తిడి తెచ్చారు. అయినా ఆమె పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. అప్పటి నుంచి ప్రమీల కుటుంబంపై సుగుణమ్మ కుటుంబం కక్ష పెంచుకుందని అంటున్నారు. కూటమి ప్రభుత్వంలో కూడా టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

● వడ్డెర సంఘం నాయకులు


మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త వడ్డె నవీన్ ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం నగరంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో వడ్డెర సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచుపు వెంకటేష్, శ్రీసత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డే సిమెంట్ పోలన్న, సుధాకర్ తదితరులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. నవీన్‌పై అక్రమ కేసు పెట్టి పోలీసులు శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పెట్టారని అన్నారు. అందుకే నవీన్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. పోలీసుల థర్డ్ డిగ్రీ ప్రయోగం వల్లే ఈ దారుణం జరిగిందని అన్నారు. దీనికి కారణమైన సుగుణమ్మ, నరసింహారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులను విచారించాలని, తలుపుల ఎస్ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ, డీఎస్పీ, సీఐ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. లేదంటే వడ్డెర సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

చివరి సందేశం సోదరికి..

"అరుణక్కా.. నీకే చెబుతున్నా! వీళ్లు ఎవరూ నేను చెప్పింది వింటారో లేదో తెలియదు. నిన్న ఏమి జరిగిందో ఏమో నాకు తెలియదు. నేను ఓబుళరెడ్డిపల్లికి పోదామని బయలుదేరాను. నరసింహారెడ్డి ఇంటివద్ద సుగుణమ్మ కనిపించింది. బండి ఆపి పలకరించాను. ఆమె ముఖం చూస్తే ఎవరో కొట్టినట్లు కనిపించింది. నేను పోతావుంటే ఆమె 'ఈశ్వర్ రెడ్డీ వీడే నన్ను కొట్టాడు. నా చైన్ లాక్కున్నాడు' అనింది. అందరినీ పిలిచింది. వారెవరూ నా మాట ఏవరూ వినలేదు. నేను చైన్ తీసుకుంటే పారిపోకుండా అక్కడే ఎందుకు ఉంటాను..? 'వాడు తెలిసో తెలియక చేసినాడేమో.. సుగుణమ్మ కాళ్లమీద పడితే క్షమిస్తుంది.' అన్నారు. నన్ను, బండిని చెక్ చేసినా ఏమీ దొరకలేదు. 'బైకు ఇక్కడే పపెట్టి నువ్వు ఇంటికి పో వై..' అన్నారు. ఇక్కడే ఉంటాను. వెళ్లిపోతే నింద మోయాల్సి వస్తుందని అన్నా వినిపించుకోలేదు. బైకు అక్కడే పెట్టి నేను ఇంటికి వెళ్లిపోయాను. ఆ తరువాత నా బైకులో చైన్ దొరికిందని అన్నారు. తలుపుల స్టేషన్‌కు పిలుచుకునిపోయారు. ఏమి జరిగిందని ఎవరూ అడగలేదు. ఎస్ఐ నన్ను పక్కకు పిలిచి, చేతులు, కాళ్లు కట్టేసి కొట్టినాడు. దొంగతనం ఒప్పుకోమని అన్నాడు. చేసినా చేయకపోయినా ఒప్పుకోవాల్సిందే అన్నాడు. ఒప్పుకోకుంటే మీ నాన్నను తీసుకొచ్చి ఇట్లే కొడతామని బెదిరించాడు. మీనాన్న చంపేస్తారు వాళ్లు అన్నాడు. దెబ్బలు తట్టుకోలేక చివరకు ఒప్పుకున్నాను. బండి ఆడ ఆపకపోతే నాకు ఈ రామయణమే ఉండేది కాదు.." అని కన్నీటితో వివరించాడు. ఈ సెల్ఫీ వీడియోను వరుసకు తన సోదరి అయ్యే అరుణకు పంపించాడు. ఆ తరువాత ఆత్మహత్య చేసుకున్నాడు.

బెస్ట్ పీఎంశ్రీ పాఠశాల ప్రారంభం


వర్చువల్ విధానంలో పాల్గొన్న డీఈఓ

గుత్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ బాలికల గురుకుల పాఠశాల బెస్ట్ పీఎంశ్రీ స్కూల్‌గా ఎంపికైయింది. కేంద్ర మంత్రిధర్మేంద్ర ప్రధాన్ ఢిల్లీలో వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ ప్రసాద్‌బాబు హాజరయ్యారు. విద్యావిధానాన్ని అభివృద్ధి పరిచేందుకు ఈ విధానాన్ని ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని గుత్తి ఏపీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల ఎంపికకావడం హర్షనీయం అని డీఈఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 మనోహర్, ప్రిన్సిపాల్ విజయలత, ఏఈ నరేంద్ర, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గరీబ్ రథ్‌కు అదనపు కోచ్

గుంతకల్లు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): యశ్వంతపూర్-పూరీ వెళ్లే గరీబ్ రథ్ (22883/84) రైలుకు అదనంగా ఓ ఏసీ త్రీటైర్ కోచ్‌ను జత చేయనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు రెండు నుంచి ఈ అప్ అండ్ డౌన్ రైళ్లకు ఈ అదనపు బోగీను జత చేస్తామన్నారు. ఇప్పటి వరకూ 17 కోచ్‌లతో వెళ్లే ఈ రైలు ఇకపై 18 కోచ్‌లతో నడుస్తుందన్నారు.

రేపు జాబ్‌మేళా

అనంతపురం రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఈనెల 31న ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఆ మేరకు మంగళవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. శ్రీరామ్‌లైఫ్ ఇన్సూరెన్స్, స్విగ్గీ, హిటాచీ క్యాష్ మేనేజమెంట్ సర్వీస్, సంగీత మొబైల్స్, కియ ఇండియా, కీర్తి మెడికల్ స్టోర్స్ వంటి 13 కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులు అర్హులన్నారు. ఉదయం 9:30గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభం అవుతుందన్నారు. వివరాలకు 8317520929 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కట్టుదిట్టంగా సెక్టోరల్స్ దరఖాస్తుల పరిశీలన

అనంతపురం విద్య, జూలై29(ఆంధ్రజ్యోతి): సెక్టోరల్స్ నియామకాల పక్రియ సమగ్రశిక్ష అధికారులకు కత్తిమీదసాములా తయారైంది. ఇప్పటికే ఓసారి నోటిఫికేషన్ ఇచ్చి ఎంపిక చేయగా.. వివిధ ఆరోపణలు రావడంతో పూర్తిస్థాయిలో సెక్టోరల్స్‌ను నియమించలేకపోయారు. మరోసారి సెక్టోరల్స్ నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈసారి ఏపీసీ శైలజ ఆధ్వర్యంలో ప్రక్రియ ఎలా చేపడతారోనని టీచర్లు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఆరు సెక్టోరల్ పోస్టులకు 171 దరఖాస్తులు రాగా.. పరిశీలన పక్రియ అత్యంత గుట్టుగా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కమిటీతో చేయిస్తున్నారు. మూడురోజులుగా సాగుతున్న ఈ పరిశీలన మంగళవారానికి దాదాపు పూర్తయిందని తెలుస్తోంది. పరిశీలన పక్రియ ఇంకా కొనసాగుతోందని ఏపీసీ చెబుతున్నారు. దీంతో ఉపాధ్యాయ వర్గాలలో ఉత్కంఠ నెలకొంది.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్టంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయని వివరించారు. మార్కెట్‌కు మొత్తంగా 1062 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

మార్గదర్శకుల గుర్తింపుపై దృష్టి: ఇన్‌చార్జి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4 కార్యక్రమం కింద మార్గదర్శకుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జీరో పావర్టీ పీ-4 కార్యక్రమం, పింఛన్ల పంపిణీ, బీఎస్‌డబ్ల్యుఎస్ తదితర అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు తదితరులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో మార్గదర్శకులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వచ్ఛందంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 18వేలకు పైగా బంగారు కుటుంబాలను దత్తత ఇచ్చినట్లు వెల్లడించారు. వివిధ శాఖల అధికారులు అవగాహన కల్పించి మార్గదర్శకులను గుర్తించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఆగస్టు 1న పింఛన్ల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెం ట్ కలెక్టర్ సచిన్ రహార్, సీపీఓ అశోక్‌కుమార్, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ శివశంకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డీఆర్డీఏ పీడీ శైలజ, మైన్స్ డీడీ ఆదినారాయణ, డ్వామా పీడీ సలీమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులను ముంచిన మిర్చి వ్యాపారి

● రూ.2 కోట్లకు పైగా కుచ్చుటోపీ

● పోలీసులను ఆశ్రయించిన బాధిత రైతులు

బొమ్మనహాళ్, జూలై 29(ఆంధ్రజ్యోతి): తాము పండించిన పంటను కొనుగోలు చేసి, డబ్బులివ్వకుండా మోసం చేస్తున్నాడని ఓ వ్యాపారిపై మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన మిర్చి రైతులు పోలీసులను ఆశ్రయించారు. బాధితరైతులు తెలిపిన మేరకు మండలంలోని గోవిందవాడ, దేవగిరి గ్రామాల రైతులు నుంచి ప్రకాష్ అనే వ్యాపారి మిర్చి కొనుగోలు చేసి దాదాపు రూ. 2 కోట్లకు పైగా ఇవ్వకుండా మోసం చేస్తున్నట్లు బాధిత రైతులు సూరి రామచంద్ర, సుంకన్న, ఖలంధర్, గంగధర, వన్నూరుస్వామి, కూమారి, మనోహర్, లోకేష్, మారెన్న, రామంజి తదిరులు పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించినట్లు బాధితులు తెలిపారు. ఈ విషయంపై బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ వివరణ కోరగా గోవిందవాడ గ్రామానికి చెందిన ఖలందర్ అనే రైతు ప్రకాష్ అనే వ్యాపారికి రూ. 15 లక్షల విలువ చేసి మిర్చి పంటను ఇస్తే రూ. 2 లక్షలు మాత్రమే ఇచ్చాడు. మరో రూ. 13 లక్షలు రావాల్సి ఉందని రైతులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెపారు.


విలేకరులతో మాట్లాడుతున్న గోవిందవాడ రైతులు

ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధం కావాలి

● ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్ బాబు

బుక్కరాయసముద్రం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి ఉమ్మడి జిల్లా రైతులు సిద్ధం కావాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు తెలిపారు. రానున్న రోజుల్లో వర్ష సూచన లేకపోవడంతో వర్షాధార ఎర్ర నేలల్లో జొన్న, కొర్ర, కంది పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. నల్లరేగడి నేలల్లో కంది, ఆముదం, పత్తి పంటలు ఆగస్టు మొదటి వారం వరకు విత్తుకోవచ్చని తెలిపారు. జూన్‌లో వర్షాధారంగా వేసిన వేరుశనగ, కంది, ఆముదం పంటలు బెట్టకు గురికావడం గమనించామన్నారు. దీనిని అధిగమించడానికి రైతులు 19:19:19 నీటిలో కరిగే ఎరువును 10 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. నీటి పారుదల కింద సాగుచేసిన వేరుశనగ పూత దశలో ఉందన్నారు. రైతులు ఎకరాకు 200 కిలోల జిప్సం పూత దశలో వేయాలన్నారు. ప్రస్తుతం విత్తిన వేరుశనగ పంటను కుళ్లు, రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశం ఉందన్నారు. కుళ్లు నివారణకు కార్బండిజం, మాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదలు బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. రసం పీల్చే పరుగు నివారణకు ఇమిడక్లోప్రిడ్ 0.5 మి.లీ., లీటరు నీటికి కలిపి స్థానిక వాతావరణ పరిస్థితుల మేరకు పిచికారీ చేసుకోవాలన్నారు. కంది పంట విత్తిన 20-30 రోజులకు గొర్ర, గుంటకలతో అంతరకృషి ద్వారా కలుపు నివారణ చేయాలన్నారు.

వచ్చే ఐదు రోజులు వానలు లేవు

రానున్న ఐదు రోజుల్లో వర్షసూచన లేదని వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి తెలిపారు. అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 33.8 నుంచి 35.2 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.2 నుంచి 24.8 డిగ్రీల సెల్సియస్ నమోదవుతాయన్నారు. పశ్చిమ దిశగా గాలులు గంటకు 15 నుంచి 16 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. గాలిలో తేమ ఉదయం 62-65 శాతం, రాత్రి సమయాల్లో 42-48 శాతం ఉంటుందన్నారు.

వ్యాలీగ్రీన్ గార్మెంట్స్ పరిశీలన


వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పామిడి, జూలై 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గజరాంపల్లి గ్రామంలోని వ్యాలీగ్రీన్ గార్మెంట్స్ ఇండస్ట్రీని జిల్లా పరిశ్రమల కేంద్రశాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. పరిశ్రమ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, మహిళల శిక్షణపై టీడీపీ నాయకుడు, వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ అధినేత పెరుమాళ్ల జీవానందరెడ్డితో సమీక్షించారు. ఇప్పటి వరకూ నాలుగు వేల మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చామని, శిక్షణా సమయంలో రూ.5వేలు స్టైఫండ్ ఇవ్వడంతో పాటు ఉచిత బస్సు, భోజన వసతులు కల్పించామని, వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించామని జీవానందరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలశాఖ జీఎం సీ శ్రీనివాస్ యాదవ్, అసిస్టెంట్ డైరెక్టర్ కే రాజశేఖర్ రెడ్డి, ఐపీఓ భువనేశ్వరి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన రామగిరి సీఐ


సీఐ శ్రీధర్

చెన్నేకొత్తపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రామగిరి సీఐ శ్రీధర్ తిరిగి విధుల్లో చేరారు. ఆయన గతనెల 27వతేదీ నుంచి సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. నెల రోజుల తరువాత మంగళవారం తిరిగి విధులకు హాజరయ్యారు. అప్పట్లో ఉన్నఫలంగా సెలవులో వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాలతోనా? రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో వెళ్లారా అన్న చర్చ సాగింది. పాపిరెడ్డిపల్లిలో వైసీపీ కార్యకర్త లింగమయ్య హత్య, జగన్ పర్యటనలో కుంటిమద్ది హెలీకాప్టర్ వద్ద చోటు చేసుకున్న పరిణామాలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. దీనికి తోడు రామగిరి మండలంలో బాలికపై అత్యాచార ఘటన కూడా రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనల నేపథ్యంలో తీవ్ర ఒత్తిళ్లతోనే సీఐ సెలవుపై వెళ్లారన్న చర్చ సాగింది. సీఐ తిరిగి ఇక్కడ విధుల్లో చేరతారా, లేదా అన్న సందేహాలు కూడా తలెత్తాయి. ఈ క్రమంలో ఆయన విధుల్లో చేరడంతో ఊహాగానాలకు తెరపడినట్లయింది. హెలీప్యాడ్ ఘటన, చలో పేరూరు కేసులో విచారణకు సంబంధించి ప్రస్తుతం స్తబ్దత నెలకొంది. సీఐ రావడంతో విచారణ వేగం పుంజుకుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, వ్యక్తిగత కారణాలతోనే సెలవుపై వెళ్లానని సీఐ శ్రీధర్ పేర్కొన్నారు.

బాలుడికి దంతాలు

● మెగా పీటీఎం 2.0లో సీఎంను కలిసిన ఫలితం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


విద్యార్థి బాలు

కొత్తచెరువు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జన్యులోపంతో ఇబ్బంది పడుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థి బాలుకు మంచి రోజులు వస్తున్నాయి. కొత్తచెరువు బీసీ కాలనీలో ఉంటున్న మాధవి, నరసింహ దంపతుల కుమారుడు బాలు. కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో ఈ నెల 10న జరిగిన మెగా పీటీఎం 2.0లో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మాధవి, ఆమె నలుగురు పిల్లలు కలిసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో బాలు ఆరోగ్యం గురించి సీఎం చంద్రబాబు ఆరా తీశారు. జన్యులోపంతో బాధపడుతున్నట్లు తెలుసుకుని, వైద్యం చేయిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడటంతో హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ నామినేని స్పందించారు. బాలుకు ఉచితంగా వైద్యం చేస్తామని ప్రకటించారు. దీంతో ఈ నెల 26న మాధవి, నరసింహ దంపతులు తమ కుమారుడు బాలును తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ ఆంధ్రజ్యోతి యాజమాన్యం సహకారంతో బాలును ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. బాలుకు పుట్టిన తరువాత రెండు దంతాలు మాత్రమే వచ్చాయి. జన్యు లోపం కారణంగా మిగిలిన దంతాలు రాకపోవడంతో సరైన ఆహారం తీసుకోలేకపోతున్నాడు. నమిలి తినాల్సిన పండ్లు, కూరగాయలు, ఇతర ఘన పదార్థాలకూ దూరమయ్యాడు. దీంతో అతనిలో ఎదుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తాయి. బాలును పరీక్షించిన వైద్యులు.. కృత్రిమ దంతాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికోసం కొలతలు తీసుకున్నారు. ఆగస్టు 4న తమ కుమారుడిని ఆస్పత్రికి తిరిగి తీసుకురమ్మన్నారని బాలు తల్లిదండ్రులు తెలిపారు. దంతాలు ఏర్పాటు చేస్తే తనకు ఇష్టమైన అన్ని పదార్థాలను తింటానని బాలు సంబరంగా అంటున్నాడు. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, డాక్టర్ శ్రీనివాస్ నామినేనికి బాలు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

పొలం పిలుస్తోంది

బత్తలపల్లి, జూలై29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన బత్తలపల్లిలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవ సాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఏడీ లక్ష్మనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బత్తలపల్లి సమీపంలోని కంది పంటను పరిశీలించి, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం స్థానిక వ్యవసాయ కార్యలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఎరువుల దుకాణాను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

● పుట్టపర్తి రూరల్: వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు అదునులో పంటలు సాగుచేయాలని మండల వ్యవసాయ అధికారి శ్రీవాణి తెలిపారు. మండల పరిధిలోని బీడుపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్ర మం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు, ఇన్సూరెన్సు కంపెనీ సిబ్బంది, రైతులు జయప్ప, రాము, మారుతి పాల్గొన్నారు.

వన్యప్రాణులను కాపాడాలి

ధర్మవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులు అంతరించి పోకుండా వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రిషి విద్యాలయ పాఠశాల ప్రిన్సిపాల్ కరుణ్ స్వరూప్‌సింగ్ తెలియజేశారు. స్థానిక రిషి విద్యాలయ పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, సీఈఓ రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లపై టార్పాలిన్ కప్పండి

ధర్మవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): టార్పాలిన్ కప్పి టిప్పర్లలో ఇసుకను తరలించాలని ఆర్టీఓ రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి కప్పడం లేకుండా వాహనాలలో ఇసుక తరలిస్తున్నపుడు, వెనుక వస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కావున ఇసుకను తరలించే టిప్పర్ల డ్రైవర్లు పట్ట కప్పుకుని వెళ్లాలని, లేకపోతే జరిమానా విధించడంతో పాటు ఆ వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కళాశాల రహదారికి స్థల పరిశీలన

ముదిగుబ్బ, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ప్రభుత్వ కళాశాలకు ఉన్న రోడ్డు పోయింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ నారాయణ స్వామి, 342 జాతీయ రహదారి అధికారులు మంగళవారం ప్రభుత్వ కళాశాలను పరిశీలించి ప్రత్యామ్నాయ దారి కోసం స్థలాన్ని పరిశీలించారు. నివేదికను తయారు చేసి సంబంధిత అధికారులకు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, మండల సర్వేయర్ సుశాంతి, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం మూడోరోజు పరిశీలన

గాండ్లపెంట, జూలై 29(ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా కేంద్ర బృందం వివిధ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్నారు. మంగళవారం మూడోరోజు మండలంలోని మద్దివారిగొందిలో పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కింద చేసిన పనులపై కూలీలతో ఆరాతీశారు. అలాగే ఉపాధి పనుల ఉపయోగాలపై కేంద్రం బృందం దయార్‌రెడ్డి లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ రమేష్‌బాబు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ట్రైనీ ఎస్ఐలు

అమడగూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండల నూతన ట్రైనీ ఎస్ఐగా ప్రదీప్‌రాజ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 2024 బ్యాచ్ ఎస్ఐగా శిక్షణ పొంది అనంతపురం పీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు అమడగూరు ట్రైనీ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

● నల్లమాడ: మండల పోలీస్ స్టేషన్‌కు ట్రైనీ ఎస్ఐగా సతీష్ మంగళవారం బాధ్యతలుచేపట్టారు. ఎస్పీ రత్నఆదేశాల మేరకు నల్లమాడ ట్రైనీ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టానన్నారు.

విద్యార్థులకు అత్యుత్తమ ప్లేస్‌మెంట్సే ధ్యేయం

● సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజ్ డీన్

పుట్టపర్తి రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అత్యుత్తమ కంపెనీలలో ప్లేస్‌మెంట్ కల్పించడమే తమ ధ్యేయమని డీన్ బాలకోటేశ్వరి మంగళవారం పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రపంచం లోని అతిపెద్ద ఎయిర్‌కండీషనర్ తయారీదారు డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ శ్రీసిటీ విభాగంలో తమ కళాశాల విద్యార్థులకు వారంరోజుల పాటు ఓరెయెంటెడ్ ఇన్‌ప్లాంట్ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా తమ కళాశాల విద్యర్థులకు అత్యుత్తమ ప్లేస్‌మెంట్ కల్పించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు డీన్ తెలిపారు.

'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి: డీఈ

తనకల్లు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సూర్యఘర్ పథకాన్ని అర్హత ఉన్న ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ డీఈ మోసేస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ ఏఈ శ్రీకాంత్, సబ్‌స్టేషన్ ఇన్‌చార్జ్ లిఖిత్, టీడీపీ నాయకురాలు తోట సరోజమ్మ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి



నాగపంచమి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నల్లచెరువు, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బసవన్న కట్టవద్ద ఉన్న నాగల ప్రతిమలకు నాగుల పంచమి సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధతలో ప్రత్యేక పూజలు చేశారు. నాగలకట్టను ప్రత్యేకంగా అలంకరించి, పుట్టలో పాలుపోశారు.

వాహనం ఢీకొని గొర్రెల మృతి

ముదిగుబ్బ, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఐదు గొర్రెలు, మేక మృతి చెందాయి. మండంలోని వలించెర్లోపల్లికి చెందిన బాల వీరనారప్ప గొర్రెలు మేపుకొని ఇంటికి వెళ్లేందుకు బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. ముదిగుబ్బ వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఐదు గొర్రెలు, మేక మృతి చెందాయి. దీంతో రూ.90వేల దాకా నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

రైతులకు శిక్షణ

నల్లచెరువు, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓరువాయి గ్రామ సచివాలయంలో మంగళవారం ఏఓ లక్ష్మీప్రియ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథులుగా ఏడీఏ సనావుల్లా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వ్యవసాయ పనిముట్లు, డ్రోన్లు, డ్రిప్‌లు, పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం పంటల సాగుపై సూచనలు, సహాలుఇచ్చారు. డీఎటీటీసీ కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, డీడీఏ డీఆర్‌సీ రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

'పొదుపు'తో ఆదర్శ మహిళలు

● ప్రభుత్వం ఇస్తున్న రుణాలతో కుటుంబానికి చేయూత



అమృత మండల సమాఖ్య కార్యాలయం

అమడగూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పొదుపుతో రుణ సదుపాయం పొంది కుటుంబ ఆర్థిక ప్రయోజానికి మహిళలు చేదోడుగా నిలవాలని గత టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారు. దీంతో కుటుంబ జీవనం, పిల్లల చదువులు, అవస రాలకు మహిళసంఘం పేదలకు అభయహస్తమైంది. మహిళల ఆర్థిక స్వాలంబన దేశవ్యాప్తంగా స్ఫూర్తి అయింది. ప్రస్తుతం ప్రభుత్వం వివిధ రకాణ రుణాలు అందిస్తోంది. తద్వారా పొదుపు సంఘాల సభ్యులు, స్వయం ఉపాధి, చేతి వృత్తులు, చేపడితే ఆదాయంతో పాటు ఆర్థిక ప్రగతి సాధనకు మార్గం అవుతోంది. అంతేకాకుండా వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. కావున ఆ మొత్తాల మిగులుతో చేపట్టిన వ్యాపకాలను మరింత బలోపేతం చేసుకోవచ్చు. తద్వారా ఆదాయం పెరగడంతో పాటు, ఆర్థిక స్థిరత్వం కలుగుతుంది. బంగారు కుటుంబాల్లా వర్ధిల్లి, ఆ కుటుంబాల్లో మహిళలే మహారాణులుగా జీవనం సాగించవచ్చు. కరువు కాటకాలతో కొట్టుమిట్టాడుతున్న రాయలసీమ జిల్లాలో వివిధ రకాలుగా జీవనోపాధి చేసుకుంటున్న సత్యసాయి జిల్లాలోని అమడగూరు మండలంలోని పలువురు మహిళలు ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలవ్యాప్తంగా వీఓ సంఘాలు 29 ఉండగా, గ్రామ సంఘాలు 646 ఉన్నాయి. ఇందులో 6,340మంది సభ్యురాళ్లు ఉన్నారు. మండలంలోని చీకిరేవులపల్లి, అమడగూరు, మహమ్మదాబాద్, జౌకల కొత్తపల్లి, మలక వారిపల్లి, గాజులపల్లి, సోలకుంట్ల గ్రామాల్లోని అన్ని మహిళా సంఘాలు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని, తిరిగి జమ చేయడంలో ప్రాధాన్యం వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ యేడాదిలో ప్రాధాన్యం చూపించిన సంఘాలకు దాదాపు రూ. 6కోట్ల వరకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందించినట్లు సంబంధిత అధికారులు తెలిపుతున్నారు.

జీవనోపాధి దొరికింది



నేను 20 సంవత్సరాలుగా మహిళా సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్నా. ఇప్పటివరకు నాకు సంఘం ద్వారా గరిష్ఠంగా రూ.1.50 లక్షలు రుణం అందించారు. నేను టైలర్ పనిచేసుకుంటూ, చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నా. దీంతో తీసుకున్న రుణానికి వచ్చే కంతు ప్రతి నెల సక్రమంగా చెల్లిస్తున్నా. పిల్లలను చదివించుకుంటున్నా. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సంఘాల ద్వారా జీవనోపాధి కలిగింది. - కుళ్లాయమ్మ, శ్రావణి మహిళా సంఘం

ప్రశాంతంగా జీవనం



నాకు మహిళ సంఘాల ద్వారా రుణం ఇవ్వడంతో చిన్న దుకాణం నిర్వహిస్తున్నా. నాకు ఇచ్చిన రుణంతో దుకాణం నిర్వహించి జీవనోపాధికి డోకా లేకుండా జీవనం సాగిస్తున్నా. నాకు సంఘం ద్వారా రూ. రెండులక్షలు ఇచ్చారు. కుటుంబ పోషణ చేసుకుంటూ కట్టాల్సిన రుణం చెల్లించి, ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నాను. -లక్ష్మీదేవి, మహమ్మదాబాద్

సంఘాలకు ప్రాధాన్యం కల్పిస్తాం

మహిళలు ఇచ్చిన రుణాన్ని సద్వినియోగం చేసుకుని సంఘాలను సక్రమ పద్ధతిలో నడుపుకునేలా పాటుపడుతున్నాం. తీసుకున్న రుణాన్ని సద్వినియోగం చేసుకుని వారు కావలసిన ఆదాయం పొందవచ్చు. ఇచ్చిన రుణాన్ని సక్రమంగా చెల్లించే సంఘాలకు ప్రాధాన్యం కల్పించి ఆ సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి సహకారం అందిస్తాం.

- రవి, ఏరియా కోఆర్డినేటర్

హాస్టల్‌ను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతాం

● బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత



బాలికలతో మంత్రి సవిత, ఎమ్మెల్యే సింధూరారెడ్డి

బుక్కపట్నం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బాలికల వసతి గృహాలను, కేజీబీవీ, ఎంజేబీ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని రాష్ట్ర బీసీ, చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మంత్రి మంగళవారం మండలకేంద్రంలో ప్రభుత్వ బీసీ బాలికల అదనపు వసతి గృహాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డితో కలిసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిగా గాలికి వదిలేయడంతో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టంగానే విద్యాశాఖమంత్రిగా బాధ్యతలు తీసుకున్న నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యకు అత్యంత పెద్దపీట వేశారన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలోనే కాకుండా వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రభుత్వం అన్నివిద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, విద్యలో పోటీ పడి రాణించాలన్నారు. విద్యతోనే విద్యార్థులకు సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. తమ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ప్రతి జిల్లాకు రూ.3నుంచి 5కోట్లు నిధులు కేటాయించి, వసతిగృహాల మరమ్మతులు చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే మన రాష్ట్రంలో విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. బాలికలు అత్యంత ప్రతిభకనబరచి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. రాష్ట్రంలో పుట్టపర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలపెట్టడానికి కృషి చేస్తామన్నారు. బుక్కపట్నం మండల కేంద్రంలో ప్రభుత్వ బీసీ వసతిగృహం, మహాత్మగాంధీ జ్యోతిబా పూలే వసతిగృహాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రాజేంద్రరెడ్డి, గంగాధర్, వెంకటేశ్వర్లు, వార్డెన్ లలిత, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టీడీపీ మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు గంగాధర్, బాలు, సయ్యద్, పెద్దరాసు సుబ్రమణ్యం, అక్కులప్ప, యశోదరాయుడు, లావణ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఏపీ రోల్ మోడల్

● ఎమ్మెల్యే సింధూరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

ఓబుళదేవరచెరువు, జూలై 29(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిలో ఏపీని రోల్‌మోడల్ కావడం ఖాయమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అల్లాపల్లి ప్రాథమిక సహకారం సంఘం సొసైటీ అధ్యక్షుడిగా నియమితులైన బోయపల్లి శివారెడ్డి ప్రమాణ స్వీకారానికి మంగళవారం వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అధ్యక్షుడిగా బోయపల్లి శివారెడ్డి, డైరెక్టర్లగా బాలు, నారాయణలచే ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ వెంకటాచలం ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నూతన చైర్మన్, డైరెక్టర్లను ఎమ్మెల్యే, మాజీ మంత్రి సన్మానించారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు తుమ్మల మహబూబ్‌బాషా, రాష్ట్ర డైరెక్టర్ కాలేనాయక్, కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, పీట్ల సుధాకర్, జీవీ రామలక్ష్మి, రాజారెడ్డి, జయమ్మ, జాకీర్, అంజనప్ప, నిజాం, ఓబులరెడ్డి, సుబాషిని, నాగవేణి, జివి ఆదినారాయణ, కంచి సురేష్, కొత్త సుధాకర్‌రెడ్డి, గంటా శ్రీనివాసులు, ఆర్‌ఎంపీ క్రిష్ణమూర్తి, జౌలి బాబా, హనుమంతరెడ్డి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం: ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన ప్రతి హామీని ప్రాధాన్యత క్రమంలో తప్పకుండా నేరవేరుస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం మండలంలోని అల్లాపల్లి పంచాయతీలోని ఉగ్గిరెడ్డిపల్లిలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వ యేడాదిలో చేపట్టాన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు అందని అర్హులను ఇంటింటా కార్యక్రమంలో గుర్తించి, వారికి ఎందుకు పథకాలు అందులేదో సమస్యను వారికి నేరుగా వెల్లడిస్తామన్నారు. అలాగే నేను సైతం అంటూ ఉగ్గిరెడ్డిపల్లిలో రాగి కంకులు కోస్తున్న కూలీలతో కలిసి ఎమ్మెల్యే కొడవలి పట్టి కంకులు కోస్తూ, మహిళ రైతుల్లో ఉత్సహం నింపారు. అనంతరం మహిళ కూలీలతో మాట్లాడి, వారి సాదక బాధకాలు తెలుసుకున్నారు. బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న రమేష్‌కు వైద్యసేవలు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

విమర్శలు పట్టించుకుంటే సమస్యలు పరిష్కరించలేం

● పరిటాల శ్రీరామ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎవరో విమర్శలు చేస్తున్నారని అనుకుంటే మనం ఏ సమస్యలూ పరిష్కరించలేమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. ఆయన మంగళవారం పట్టణంలోని 1, 2, 3, 4 వార్డులలో 'మీ సమస్య-మాబాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు, ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... ఏడాది పాలన తరువాత ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని, అందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమంపైనా విమర్శలు సరికాదన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యల్లో కొన్ని అయిన పరిష్కరించాలన్నదే లక్ష్యమన్నారు. ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు ఫణికుమార్, పురు షోత్తంగౌడ్, సంధా రాఘవ, భీమనేని ప్రసాద్‌నాయుడు, లోకేశ్, అంబటి సనత్, రాళ్లపల్లి షరీఫ్, అత్తర్ రహీం, అస్లాం, కేశగాళ్ల శీన, రాజ్‌కుమార్ నాయుడు, మాబు, పోలంకి హరి, బొట్టు కిష్ట, జింకల రాజన్న, కొత్తపేట ఆది, పల్లపు శంకర్ పాల్గొన్నారు.

నేడు తుమ్మల, సుబ్బరావుపేటలో 'మీ సమస్య-మా బాధ్యత'

● ధర్మవరం రూరల్: మండలంలోని తుమ్మల, సుబ్బరావుపేట గ్రామ పంచాయతీల్లో బుధవారం 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్ చౌదరి తెలిపారు. ఆయన మంగళవారం పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో రూరల్ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ సచివాలయాల వద్ద గ్రీవెన్స్ నిర్వహిస్తామని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని కోరారు. టీడీపీ మండలకన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, నాయకులు గొట్లూరు శ్రీనివాసులు, విజయసారథి, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు, ఏగినాటి రమణ, భాస్కర్‌చౌదరి, తెలుగుయువత విజయ్ చౌదరి, దళవాయి కుళ్లాయప్ప, బిల్వంపల్లి బాబు పాల్గొన్నారు.

పని గంటలు తగ్గించాలి: సీఐటీయూ

ధర్మవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ధర్మవరం మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ సెక్షన్‌లో ఔట్ సోర్సింగ్ కార్మికులతో 12గంటలు పనిచేయిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఆ పనివిధానాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఇంజనీరింగ్ కార్మికులతో కలిసి మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను వారు సమస్యను విన్నవించారు. కార్మికులు పదేళ్ల నుంచి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తమ విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. వారి విధులలో మార్పులు, చేర్పులు చేస్తూ రోజుకు 12గంటలు పనిచేయాలని చెప్పడం తగదన్నారు. దీని వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు విన్నవించారు. స్పందించిన కమిషనర్ కార్మికులు 8 గంటలు పనిచేసేవిధంగా మార్పు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు బొగ్గు నాగరాజు, బాబు, సాకేబాబు, యోగేశ్, అనిల్, లక్ష్మీఓబులేశు ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం

● కలెక్టర్ టీఎస్ చేతన్



బస్టాండ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ధర్మవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. బస్టాండ్ పరిసరాల్లో పరిశుభ్రత, తాగునీటి వసతి, టిక్కెట్ కౌంటర్లు, సైకిల్ బస్టాండ్, మరుగుదొడ్ల నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. ఆర్టీసీ స్థానిక అధికారులకు పలు సూచనలతో పాటు ఆదేశాలు జారీచేశారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేకంగా మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఆర్టీసీ డిపోను తనిఖీ చేసి బస్సుల మైలేజ్ విషయంపై ఆరాతీశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ సురేశ్ బాబు, డిపో ఇన్‌చార్జ్ సికిందర్, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ల తనిఖీ

స్థానిక మార్కెట్‌యార్డ్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ టీఎస్‌చేతన్ మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గోడౌన్‌ల ఈవీఎంల భద్రతకు తీసుకుంటున్న జాగ్రత్తలను ఆయన సమీక్షించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ సురేశ్ బాబు, టీడీపీ, బీజేపీ నాయకులు ఫక్రుద్దీన్, సాకే ఓబుళేశు, కాంగ్రెస్ నాయకులు శివప్రసాద్, కరీం ఉన్నారు.

పుట్టపర్తి అర్బన్ ట్రైనీ ఎస్ఐగా ఉమాదేవి

పుట్టపర్తి రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): అర్బన్ ప్రొబేషనరీ ఎస్ఐగా ఉమాదేవి బాధ్యతలు స్వీకరించారు. శిక్షణ కాలం పూర్తిచేసుకున్న ఎస్ఐలు నలుగురిని పుట్టపర్తి సబ్‌డివిజన్‌కు కేటాయించగా ఇందులో ఉమాదేవి పుట్టపర్తి అర్బన్ పోలీసుస్టేషన్ ఎస్సైగా, క్రాంతి కొత్తచెరువు పోలీసుస్టేషన్, సతీష్ నల్లమాడ పోలీసు స్టేషన్, ప్రదీప్‌రాజ్ అమడగూరు పోలీసుస్టేషన్లలో బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మంగళవారం డీఎస్పీ విజయ్‌కుమార్‌ను కలిసి జ్ఞాపికలను అందజేశారు.

కాల్‌మనీ గ్యాంగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలి

● బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): కాల్‌మనీ గ్యాంగులపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తిచేశారు. ఇటీవల కాల్‌మనీ గ్యాంగ్‌దాడికి గురైన శాంతి నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు రమణ కుటుంబాన్ని ఆయన మంగళవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. గతంలోనూ ఇలానే దాడులు జరిగాయని రమణతోపాటు ఆయన భార్య భారతి పరిటాల శ్రీరామ్ ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మవరంలో కాల్‌మనీ గ్యాంగుల బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకు రావాలని పరిటాలశ్రీరామ్ పిలుపునిచ్చారు. ప్రజలు కూడా ప్రైవేటు అప్పుల జోలికి వెళ్లరాదని, వారి వేధింపులు తట్టుకోలేక క్షణికావేశంతో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.

పెరుగుతున్న కాల్‌మనీ మాఫియా దుర్మార్గాలు

● బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు

ధర్మవరం, జూలై29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజలను ఆర్థికంగా దోచుకుంటున్న కాల్‌మనీ మాఫియాల దుర్మార్గపు చర్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పేర్కొన్నారు. ఆయన మంగళవారం వడ్డీ వ్యాపారుల బాధితులతో కలిసి ఎన్డీఏ స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మవరంలో కాల్ మనీ బాధితులకు రక్షణగా ఎన్డీఏ కార్యాలయం ముందుకు వచ్చిందన్నారు. ఈ కాల్ మనీ వ్యవస్థకు ప్రధాన ప్రోత్సాహకుడు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామి రెడ్డి అని విమర్శించారు. ఆయన హయాంలో కేతిరెడ్డి, ఆయన అనుచ రులు అనేక అక్రమ కార్యకలాపాలకు పాల్పడ్డారన్నారు. ప్రత్యేకంగా ఎర్రగుంట రాజా అనే వడ్డీ వ్యాపారి కేతిరెడ్డి వర్గానికి చెందిన వాడన్నారు. అతడి దౌర్జన్యాలను బాధితులు బీజేపీ నాయకుల ఎదుట వెల్లడించారన్నారు. ఇకపై వడ్డీ వ్యాపారులు పేద ప్రజల జోలికి వెళ్తే సహించేది లేదన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేశు, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర, మండల అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, మైనార్టీ నాయకులు నబీరసూల్, శంకర, చంద్రమౌళి, గంగాధర్, చిన్న లింగమయ్య, జూటూరు వెంకటేశ్, ప్రకాశ్‌గౌడ్, బండ్లపల్లి రాజు, సోమ్లానాయక్, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేద్దాం

● బత్తలపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి సత్యకుమార్ కార్యాలయ ఇన్‌చార్జ్ హరిష్‌బాబు పిలుపునిచ్చారు. బత్తలపల్లిలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం బీజేపీ నాయకులతో సమావేశం నిరహించి మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ పగ్గాలు చేపట్టిన వ్పటిన తరువాత తొలిసారిగా జిల్లాకు వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకులేటి వీరనారప్ప, ఓబులేసు, భాస్కర్, సురేంద్ర నాయుడు, మల్లికార్జున, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే అధికారులు: ఎంపీపీ



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

అమడగూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించడానికే అధికారులుండేదని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారంఎంపీపీ అధ్యక్షతన ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజశేఖర్, తహసీల్దార్ రామనాథ్‌రెడ్డి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమస్యలు వెల్లువెత్తాయి. కొన్నినెలలుగా చినగానిపల్లి, జేకేపల్లి పంచాయతీల్లో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయని, ఆయా పంచాయతీల ఎంపీటీసీలు విద్యుత్ అధికారులపై మండిపడ్డారు. 32కేవీ, 11కేవీ విద్యుత్ లైన్లు సమస్యగా మారాయని ధ్వజమెత్తారు. అలాగే మండలంలోని చినగానిపల్లి పంచాయతీలోని బాబాసాబ్ కొత్తపల్లిలో కొన్ని నెలలుగా తాగునీటి సమస్య నెలకొందని పరిష్కరించాలని కోరారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో పైపులైన్ సమస్యతో తాగునీరు అందడంలేదన్నారు. వీటిపై అధికారులు స్పందించి తాగునీటి సమస్యలేకుండా పైపులైన్ ఏర్పాటు చేస్తామన్నారు. పూలకుంటపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మధ్యాభోజన సమస్య ఉందని, పిల్లలు భోజనం పాఠశాలలో తినకుండా ఇళ్లలో తింటున్నట్లు చెప్పారు. ఎంఈఓ జిలాన్ పరిశీలించి, వారిపై చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, హౌసింగ్ ఏఈ శివా, కార్యదర్శులు భాస్కర్, మమత, జానకీ, సునియా, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

న్యూస్ బాక్స్

వడిసలమ్మకు ప్రత్యేక పూజలు



మడకశిర టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరాపురం బస్టాండ్ వద్ద వెలసిన వడిసలమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం తులసిమాల అలంకరణలో కొలువుదీరారు. శ్రావణ మాసం మొదటి మంగళవారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, గంగభవాని, కొల్లపురం, మూలకంఠేశ్వరి ఆలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఘనంగా నాగపంచమి

పెనుకొండ రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నాగపంచమిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు నాగులకట్టవద్ద పుట్టలో పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు.

ఏడాదిగా ప్రజలకు సుపరిపాలన



ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, జులై 29(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందుతోందని మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని మొరసనపల్లి పంచాయతీ దొరణాలపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలపై వివరించారు. నాయకులు బయపరెడ్డి, శ్రీరామిరెడ్డి, వేమనారాయణ, కిష్టప్ప, విజయలక్ష్మి, విశ్వనాథరెడ్డి, సురేంద్ర, మంజు, చంద్ర, బాలాజీ పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య

చిలమత్తూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటం రూపకల్పన చేసే ఉద్దేశ్యంతో గురువారం ధర్మవరంలో నిర్వహించే సీపీఐ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం సీపీఐ నాయకులతో కలిసి మహాసభల నిర్వహణపై చర్చించారు. మహాసభలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. బాలచంద్ర, వినోద్‌కుమార్, దాదాపీర్, బాలస్వామి, గోవిందరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

పెనుకొండ, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెడ్‌రిబ్బన్ అధ్యక్షుడు ప్రిన్సిపాల్ సుదర్శన్ అధ్యక్షతన మంగళవారం విద్యార్థులకు ఎయిడ్స్ నివారణపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి రావడానికి కారణాలు, నివారణ, డ్రగ్స్‌వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన షబ్రీన్‌తాజ్, నిజాముద్దీన్‌బాబాలకు బహుమతులు అందజేశారు. నోడల్ ఆఫీసర్ జయప్రకాశ్, సభ్యులు బషీర్‌అహ్మద్, మూర్తి, హఫీజ్ పాల్గొన్నారు.

రొద్దం ఆసుపత్రికి మహర్దశ

● రూ.50లక్షలతో చురుగ్గా అభివృద్ధి పనులు



చురుగ్గా సాగుతున్న ఆస్పత్రి నిర్మాణ పనులు

రొద్దం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రొద్దం ఆస్పత్రి అభివృద్ధికి మంత్రి సవిత చొరవతో రూ.50లక్షల నిధులు రావడంతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ కాలంలో అప్పటి మంత్రి శంకర్‌నారాయణ ఆర్‌అండ్‌బీ నిధులతో రూ.2.3కోట్లతో ఆసుపత్రి భవన నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్ పునాది వరకు కట్టి వదిలేశాడు. రూ.20లక్షలు ఖర్చుపెట్టగా రూ.15లక్షలు బిల్లులు కావడంతో నష్టం వచ్చి వదిలేసినట్లు విమర్శలున్నాయి. ప్రస్తుతం పునాదులు చుట్టూ కంపచెట్లు దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి సవిత రూ.50లక్షల నిధులను ఆర్‌అండ్‌బీ ద్వారా మంజూరు చేయించారు. కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులు చురుగ్గా చేపట్టారు.

వైసీపీ నిరసన



ర్యాలీగా వెళ్తున్న వైసీపీ నేతలు

హిందూపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మహిళలపై టీడీపీ నాయకులు వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. పార్టీ ఇన్‌చార్జి దీపిక మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేసిన రుక్సానా అనే మహిళను టీడీపీ నాయకులు వేధిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధుమతి, శివ, చంద్ర, ఆసీఫ్ పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రంపై తొలగని పేరు



రైతు సేవాకేంద్రంపై తొలగని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతు భరోసా కేంద్రం పేరు

గుడిబండ, జూలై 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయంపై వేసీపీ ప్రభుత్వం పెట్టిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతు భరోసా కేంద్రం పేరు అలానే ఉంది. వ్యవసాయశాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. పేరు మార్చడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని దేవరహట్టి పంచాయతీలోని రైతు సేవాకేంద్రంపై ఉన్నపేరును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల వలయంలో షిర్డీనగర్

● కనీస సౌకర్యాలు కరువు
● పట్టించుకోని ప్రజాప్రతినిధులు
● వంక సర్వేపై అధికారుల నిర్లిప్తత



వంకలో పెరిగిపోతున్న ఆక్రమణలు

సోమందేపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని షిర్డీనగర్ సమస్యల వలయంలో కొట్టుమిట్లాడుతోంది. మౌలిక సదుపాయాలులేక ప్రజలు ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో పడరానిపాట్లు పడుతున్నారు. మరోపక్క గంగాదేవి వంక సమస్య కాలనీ ప్రజలకు కునుకులేకుండా చేస్తోంది. అధికారులకు అనేకమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపానపోలేదని ప్రజలు వాపోతున్నారు. కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా తమగోడు వినేనాథుడు లేడని విమర్శిస్తున్నారు. వర్షాకాలంలో గంగాదేవి వంక నుంచి వర్షపునీరు ఇళ్లలోకి చేరుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్, ఆర్డీఓ, మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లి అర్జీలు ఇచ్చామన్నారు. సర్వేచేసి హద్దులు నిర్ణయించి వంక ఆక్రమణలపై చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇవ్వడంతప్ప ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తరువాత పట్టణంలోని అన్ని కాలనీలు రోడ్లు, డ్రైనేజీలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.1.50కోట్లతో చేపట్టారన్నారు. కానీ తమ కాలనీలో ఇంతవరకు ఒక్క రోడ్డుసైతం నిర్మించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో అంధకారంలో మగ్గుతున్నామన్నారు. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయని, వర్షాకాలం కావడంతో రోడ్లన్నీ బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నాయన్నారు. సర్వేనంబరు 761, 762, 763లో వంక ప్రవహిస్తుందన్నారు. గతంలో పనిచేసిన తహసీల్దార్‌లు ప్రస్తుత ఆర్డీఓ ఆనంద్‌కుమార్, సర్వేయర్లు కాలువ పరిశీలించి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారన్నారు. రోజు రోజుకు వంకలో ఆక్రమణలు పెరిగిపోతున్నాయని అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో సమస్య మరింత జఠిలంగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలతోపాటు వంకకు సరిహద్దులు నిర్ణయించి ఆక్రమణలు అడ్డుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా షిర్డీనగర్ మట్టి రోడ్డు

సమన్వయంతో పనిచేద్దాం

● వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు



మాట్లాడుతున్న ఆంజనేయులు

సోమందేపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేస్తే మండలాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటుచేసిన పరిచయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరాలంటే తప్పనిసరిగా నాయకులు, అధికారులు కలిసి పనిచేయాలన్నారు. మండలంలోని 16 పంచాయతీల్లో స్థానికంగా ఉన్న సమస్యలపై నాయకులకు అవగాహన ఉంటుందన్నారు. సచివాలయంలో పని చేసే ఉద్యోగులు విధినిర్వహణలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. అదే సమయంలో పథకాలను అమలు చేసే సందర్భంగా నాయకులతో మమేకమైతే ప్రతి సమస్యను పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరేలా కృషిచేయవచ్చన్నారు. ఎంపీడీఓ వెంకటలక్ష్మి మాట్లాడుతూ సచివాలయ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మండల నాయకులు వెంకటరాముడు, కన్వీనర్ వెంకటేశులు, సిద్ధలింగప్ప, సూరి, సంజీవరెడ్డి, సూర్యనారాయణ, రామక్రిష్ణ, సర్పంచ్ నరసింహులు, రామిరెడ్డి, కిష్టప్ప, చిన్నబాబయ్య, గట్టా మహేంద్ర, భానుకీర్తి పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల విద్యార్థుల ఆందోళన



ఐటీఐ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

గోరంట్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవెంకటసాయి ఐటీఐ కళాశాల విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో యజమాన్యంతో విభేదించి కళాశాల వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిపు మొత్తాన్ని తీసుకుని, ఫీజుల పేరుతో వేధిస్తున్నారని ధీరజ్, సాయిక్రిష్ణ, చరణ్, జహీర్, సిద్దార్థ, రోహిత్, బిలాల్, నంద, అఫ్జల్, పవన్, నాగార్జున ఆరోపించారు. గత ప్రభుత్వం విద్యాదీవేన పేరుతో తల్లుల ఖాతాలో మొత్తం జమ చేయగా, కూటమి ప్రభుత్వం కళాశాలల యజమాన్యం ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. యజమాన్యం ముందుగానే విద్యార్థులనుంచి ఫీజులు వసూలు చేసిందన్నారు. ఫిబ్రవరిలో ప్రభుత్వం నిధులు మంజూరుచేసినా యజమాన్యం తిరిగి ఇవ్వకుండా ఇంకా బకాయి ఉందని వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు సచివాలయాలకు వెళ్లి తమ పేరున కాలేజీకి మంజూరైన స్కాలర్‌షిపు వివరాల ప్రింట్‌ను తీసుకొచ్చి ఆందోళనకు దిగారు. ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కరికి రూ.16వేలు, బీసీ, ఓసీలకు రూ.8వేలు వంతున ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఫీజు కట్టిన రసీదులు తీసుకురావాలని ప్రిన్సిపాల్ శివప్పనాయక్ తెలపడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోరంట్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ శేఖర్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు కళాశాల వారిని పిలిపించి విచారిస్తున్నారు. కళాశాల యజమాన్యంతో మాట్లాడి ఫీజు చెల్లించిన విద్యార్థులకు తిరిగి చెల్లించేలా చర్యలు చేపడతాని ప్రిన్సిపాల్ తెలిపారు.

బంగారు కుటుంబాల ఎంపికకు గ్రామసభ

అమరాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పి-4 బంగారు కుటుంబాల ఎంపిక కోసం సర్పంచ్ తిప్పేస్వామి అధ్యక్షతన ఎంపీడీఓ రామారావు విధివిధానాలను సచివాలయం సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలను ప్రతి ఒక్కరూ దత్తత తీసుకోవాలని సూచించారు. ఎంపీపీ ఈరన్న, పంచాయతీ కార్యదర్శి నరేష్, బాబు, పరిపాలన అధికారి ఆరాధ్య, కన్వీనర్ తిప్పజ్జ, రామచంద్ర, గౌడరంగప్ప పాల్గొన్నారు.

అగళి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సచివాలయం సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్ సుబ్బారావు, డిప్యూటీ ఎంపీడీఓ పద్మహాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన పి-4 విత్‌ఔట్ ఆధార్ ఈకేవైసీ పర్వేక్షణ గ్రామీణ సిటిజన్ ఫీడ్‌బ్యాక్ వివిధ సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే టింబక్టు కలెక్టివ్ ధ్యేయం

పెనుకొండ, జూలై 29(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే టింబక్టు కలెక్టివ్ సంస్థ ధ్యేయమని వ్యవస్థాపకుడు బబ్లూ గంగూలీ, మేరి వటవట్టం అన్నారు. మంగళవారం తిమ్మాపురంలోని కార్యాలయంలో దుర్గాశక్తి సొసైటీ సీఈఓ కవిత ఆధ్వర్యంలో 14వ వార్షిక మహాసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో సొసైటీ స్థాపించామన్నారు. దుర్గాశక్తి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

గోరంట్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ ప్రమీల మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను, రిజిస్టర్లు, స్టాక్ వివరాలు పరిశీలించారు. కేంద్రం పనితీరుపై ఆమె ఆరాతీశారు. పిల్లలను ఇంటివద్దనుంచి తీసుకొచ్చి తిరిగి ఇంటికి చేరేవరకు పూర్తి బాధ్యత కార్యకర్త, ఆయాలదేనన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

పరిగి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా వినియోగదారులు ఈనెల ఆఖరుకల్లా విద్యుత్ బిల్లును చెల్లించాలని ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప కోరారు. బిల్లులను లైన్‌మెన్ కానీ, కార్యాలయంలో కానీ, యూపీఐ ద్వారా కానీ చెల్లించవచ్చన్నారు. పరిగి మండల రైతులకు డిమాండ్ బిల్లు, అగ్రికల్చర్ కస్టమర్ సర్వీస్ ఛార్జ్ రూ.30 కట్టి రసీదు పొందాలన్నారు.

'దళితుల భూములు ఆక్రమించేందుకు కులం అడ్డురాదా?'

అమరాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): దళితుల భూములను ఆక్రమించుకునేందుకు కులం అడ్డురాదా అని బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపకుడు శివరామకృష్ణ ప్రశ్నించారు. స్థానిక అంబేడ్కర్ స్మృతివనం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కెంకరలో దళిత లలితమ్మ, కరియప్పకు చెందాల్సిన సర్వేనంబరు 29-2లో 4.42ఎకరాలు భూమి దివంగత రంగమ్మ పేరు మీద పూర్వీకుల కాలం నుంచి పట్టా ఉందన్నారు. ఆమె వీలునామా లలితమ్మకు వారసత్వం పొందాల్సిన భూమిని ఇదే మండల హాలుకూరు పంచాయతీ కాచికుంట గ్రామ అగ్రకులస్థులైన తిమ్మన్న కుమారుడు గిరీష్‌కు గత 2017లో పట్టా మంజూరు అయినట్లు చూపిస్తున్నారన్నారు. పట్టా నకలు ద్వారా దళిత భూమిని ఆక్రమించుకున్నారని, అది కేవలం వంశపారంపర్య పిత్రార్జితంగా లలితమ్మకు చెందాలన్నారు. ఆ భూమిని అగ్రకులస్థులకు రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కై ఎలా ఇస్తారని నిలదీశారు. నారాయణప్ప, కెంచప్ప, సురేష్, నరసింహమూర్తి, రామచంద్రప్ప, ప్రసాద్, శంకర్, కరియప్ప, నాగరాజు, నిద్రగట్ట మంజునాథ్ పాల్గొన్నారు.

సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న ఏడీజే కంపల్లె శైలజ

హిందూపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సమాజంపట్ల బాధ్యతగా వ్యవహరించాలని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. మంగళవారం పూలకుంట వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. హాజరైన ఏడీజే మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాతో అనర్థాలు వస్తాయన్నారు. మాదకద్రవ్యాల వినియోగంకూడా చేటన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు కన్నేసి ఉంచాలన్నారు. కొన్నిచోట్ల చిన్నపిల్లలను అక్రమంగా ఎత్తుకెళ్లి భిక్షగాళ్లుగా మారుస్తున్నారన్నారు. సీడీపీఓ వరలక్ష్మి, న్యాయవాదులు కళావతి, మురళి పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

● చైర్మన్ పీఠం టీడీపీ వశం అయ్యాక తొలి భేటీ
● హాజరు కానున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ తెలుగుదేశం పార్టీ కైవసం అయ్యాక బుధవారం తొలి కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. వైసీపీ పాలనలో నగర పంచాయతీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని కొంత మంది వైసీపీ కౌన్సిలర్లు తాము గెలిచిన వార్డులలో పర్యటించలేక పోతున్నమని స్వచ్ఛందంగా టీడీపీ తీర్థం పుచుకొన్నారు. దీంతో చైర్మన్ మార్పు అనివార్యం కాగా 15వ వార్డు కౌన్సిర్ నరసింహరాజు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన బాధ్యతలు స్వీకరించాక తొలి కౌన్సిల్ సమావేశం జరగుతుండడంతో ప్రత్యేకత సంతరించుకుంది. నగర పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక చర్చ సాగే అవకాశం ఉంది. నగర పంచాయతీ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఇప్పటికే ఎమ్మెల్యే అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతూ సొంత నిధులతో తాగునీటి సమస్య పరిష్కరం కోసం బోర్లు వేయించారు. ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం కోసం అధికారులకు సూచనలిస్తూ గతంకన్నా భిన్నంగా ఉండాలని ఆదేశిస్తూ వచ్చారు. సమావేశంలో కీలకంగా చర్చించి అందుకు అనుగుణంగా ముందుకు సాగనున్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఉదయం 11గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో జరిగే కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 12గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలోని బాలికోన్నత పాఠశాలలో జరిగే స్కూల్ కమిటీ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగే హెచ్‌డీఎస్ సమావేశంలో పాల్గొంటారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు.





బైక్ ర్యాలీలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

మంత్రికి బైక్ ర్యాలీతో స్వాగతం

రొద్దం, జూలై 29(ఆంధ్రజ్యోతి): కల్లుకుంట గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమానికి మంత్రి సవితకు టీడీపీ శ్రేణులు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. మంగళవారం మంత్రి సవిత, పెనుకొండ నుంచి రొద్దం మీదుగా వస్తుండగా పెన్నానది బ్రిడ్జినుంచి కల్లుకుంట వరకు 50బైక్‌లతో ర్యాలీ చేస్తూ ఆహ్వానం పలికారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులు, డీలర్లు ఉమాశంకర్, వాల్మీకి చంద్రశేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ హసీనా సుల్తానా

పరిగి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనపై ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రెడ్డప్ప అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల పరిరక్షణ విభాగం ప్రోగ్రాం అధికారులు మురళి, నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామస్థాయి బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు, చైర్‌పర్సన్, 14 సచివాలయ సిబ్బందికి బాల్యవివాహ నిషేధ చట్టం 206, లైంగిక వేధింపుల నిషేధిత చట్టం 212, ఏపీ మోడల్‌రూల్స్ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహ నిర్మూలన గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి తమ పరిధిలో ఇప్పటి వరకు ఎన్ని బాల్యవివాహాలు జరిగాయి, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని తెలిపారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, డిప్యూటీ ఎంపీడీఓ విజయభాస్కర్, అంగనవాడీ సూపర్‌వైజర్ శంకరమ్మ, ప్రధానోపాధ్యాయుడు కృపాసత్యరాజ్, వీఆర్‌ఓలు మద్దిలేటి కృష్ణమూర్తి, నరసింహ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో మడకశిరకు మొదటి స్థానం



పంటను పరిశీలిస్తున్న డీపీఎంలు

మడకశిర రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడంతోనే మడకశిర డివిజన్‌కు రాష్ట్రంలో మొదటి స్థానం దక్కిందని డీపీఎం లక్ష్మానాయక్ అన్నారు. మంగళవారం 26 జిల్లాల డీపీఎంలకు డివిజన్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంటలపై అవగాహన కల్పించారు. మోడల్ గ్రామలైన ఆమిదాలగొంది, జవనాడుకు, చిగతుర్పి గ్రామాల్లో రైతులు సాగుచేసిన పత్తి, కంది, రాగి, మామిడి, వక్క పంటలను చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎంలు, ఎస్‌పీఎంయూలు, రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం నియంత్రణకు గట్టి నిఘా

- ఎక్సైజ్ శాఖ డీసీ నాగమద్దయ్య



మడకశిర పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీ

మడకశిర టౌన్, జూలై29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో ఆ రాష్ట్ర మద్యం రాకుండా గట్టి నిఘా పెట్టాలని అనంతపురం ఎక్సైజ్ శాఖ డీసీ నాగమద్దయ్య ఆదేశించారు. మంగళవారం అసిస్టెంట్ ఏసీ శ్రీరాంతో కలసి స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు గ్రామాల్లో నాటుసారా తయారీపై నిఘా ఉంచాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం విక్రయిస్తున్నారా లేదా అని ఆరాతీశారు. కర్ణాటక మద్యం తరలింపుపై కేసులు నమోదు, నాటుసారా, కల్లుదుకాలపై ఎన్ని కేసులు నమోదు చేశారు అని అడిగి తెలుసుకున్నారు. ఎక్సైజ్ సీఐ మురళి కిషోర్ సిబ్బంది పాల్గొన్నారు.

మూడో సారిపట్టుబడితే పీడీయాక్ట్

హిందూపురం: కర్ణాటక మద్యం తెస్తూ మూడోసారి పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదుచేయాలని ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులపై ఆరాతీశారు. ఏసీ శ్రీరామ్, ఎస్‌ఐ ఉన్నారు.

కేబుల్ చోరీ

అమరాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో తాగునీటికి అమర్చిన విద్యుత్ కేబుల్‌ను మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు స్టార్టర్లు, కేబుళ్ల చోరీకి గురవుతున్నాయని, చుట్టూ బాక్సును ఏర్పాటుచేసి భద్రపరిచినా దొంగలిస్తున్నారన్నారు. స్థానిక నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ఇషాక్ బాషాకు ఫిర్యాదు చేశామన్నారు. పంచాయతీ కన్వీనర్ తిప్పగజ, టీఎన్‌టీయూసీ రామచంద్రప్ప, అంజి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పరిగి, జూలై 29(ఆంధ్రజ్యోతి): జయమంగళి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం ఎస్‌ఐ రంగడుయాదవ్ సీజ్ చేశారు. నదిలోంచి ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌కు సంబంధించిన కాగితాలు చూపాలని డ్రైవర్‌ను అడగ్గా తనవద్ద లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించామన్నారు.

రైతుల కోరిక మేరకే సోలార్ ప్రాజెక్ట్

● కంపెనీ ప్రతినిధి రవీంద్ర



కంపెనీ ప్రతినిధికి అంగీకార పత్రం అందజేస్తున్న రైతు

మడకశిర రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైతుల కోరిక మేరకే మడకశిర ప్రాంతంలో సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రాజెక్ట్ ప్రతినిధి రవీంద్ర అన్నారు. మంగళవారం మణూరు పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూశాఖ అధ్వర్యంలో రైతులతో గ్రామ సభ న్విహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కృషితో ఈ ప్రాంతానికి సోలార్ ప్రాజెక్ట్ వచ్చిందన్నారు. భూములు ఇచ్చే రైతులు పూర్తి అంగీకారంతోనే ఇస్తున్నారన్నారు. గ్రామ సభల్లో రైతులు తమ సందేహాలను అడిగి తెలుసుకోవచ్చన్నారు. అనంతరం 100 మంది రైతులు సంతోషంతో తమ అంగీకార ప్రతాలను అందజేసినట్లు తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి మారుతి రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మీపతి, మండల సర్వేయర్ హరీష్, వీఆర్వో నరసింహమూర్తి, రైతులు పాల్గొన్నారు.